PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక :138 | విజయవాడ, శుక్రవారం 20 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 20 December 2024 | Rs

వ్యవసాయ మార్కెట్లపై 'ఫ్రేమ్‌వర్క్'ను ఉపసంహరించుకోవాలి

- దేశవ్యాప్తంగా 23న పాలసీ కాపీలను దగ్ధం చేయండి
- ఎఐకెఎస్ పిలుపు

7



ఉచ్చులో చిక్కుకొని మృతి చెందిన చిరుత పులి

ఉచ్చులో చిక్కి చిరుత మృతి

- గోళ్లు మాయం

2

అమిత్‌షా తప్పుకో!

ప్రతిపక్షాల నినాదాలతో దద్దరిల్లిన పార్లమెంటు

- హోంమంత్రి వ్యాఖ్యలపై దేశవ్యాపితంగా నిరసనలు
- మకరద్వార్ గేటు ఎక్కి ప్రతిపక్ష ఎంపీల నిరసన
- పార్లమెంటు ఆవరణలో తోపులాట
- రాహుల్‌పై తప్పుడు కేసు
- అమిత్‌షాను వెనకేసుకొచ్చిన ప్రధాని మోడీ



గురువారం పార్లమెంటు ప్రధాన ద్వారం గేటు ఎక్కి నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష ఎంపీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారత రాజ్యాంగం 75 వ వార్షికోత్సవాల సందర్భంగా రాజ్యాంగంపై రాజ్యసభలో జరిగిన చర్చలో అంబేద్కర్ గురించి అవమానకర వ్యాఖ్యలు చేసిన అమిత్ షా తక్షణమే హోం మంత్రి పదవి నుంచి తప్పుకోవాలని యావత్ ప్రతిపక్షం ముక్త కంఠంతో డిమాండ్ చేసింది. ప్రతిపక్షాల నిరసనలు, ఆందోళనలతో పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లాయి. ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే మరుసటి రోజుకు వాయిదా పడ్డాయి. పార్లమెంటు ప్రధాన ముఖద్వారం (మకరద్వార్) వద్ద ప్రతిపక్ష ఎంపీలను బిజెపి సభ్యులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. ప్రతిపక్ష ఎంపీలు మకర ద్వార్ ఎక్కి తమ నిరసనాగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీంతో సమస్యను పక్కదారి పట్టించేందుకు బిజెపి తోపులాట అంశాన్ని ముందుకు తెచ్చేయత్నం చేసింది. తోపులాటలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు, అలాగే బిజెపి ఎంపీకి ఒకరికి గాయాలయ్యాయి. తమ ఎంపీ పడిపోవడానికి రాహుల్ గాంధీయే కారణమని బిజెపి ఆరోపించింది. ఇరు పక్షాలు పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేశాయి. అసలు సమస్య నుంచి దృష్టి మళ్లించేందుకే రాహుల్‌పై బిజెపి తప్పుడు కేసు పెట్టిందని కాంగ్రెస్ విమర్శించింది. అమిత్‌షా వ్యాఖ్యలపై దేశవ్యాపితంగా నిరసనాగ్రహాలు వ్యక్తమవుతుంటే, ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం ఆయనను పూర్తిగా వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. సోషల్ మీడియాలో ఆయన వరుస పోస్ట్‌లు పెడుతూ, అమిత్‌షాను కాపాడేందుకు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ఎదురుదాడికి దిగారు.

రాహుల్ గాంధీ భయపెట్టే విధంగా ప్రవర్తించారని బిజెపి రాజ్యసభ సభ్యుడు ఫాంగ్నాన్ కొన్యాక్ రాజ్యసభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. పార్లమెంట్ ఎదుట జరిగిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ స్పీకర్ ఓం బిర్లాకు మల్లికార్జున్ ఖర్గే లేఖ మిగతా 7లో

షా వ్యాఖ్యలకు సిపిఎం ఖండన

న్యూఢిల్లీ : రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో అంబేద్కర్ గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ప్రజల మనోభావాలను దెబ్బ తీసేవిగా ఉన్నాయని సిపిఎం విమర్శించింది. పార్టీ పొలిట్ బ్యూరో గురువారం నాడిక్కడ ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. డాక్టర్ అంబేదర్కర్ రూపశిల్పిగా ఉన్న భారత రాజ్యాంగం గురించి మాట్లాడుతూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు ఆయన మనువాద దృక్పథాన్ని బయటపెడుతున్నాయని పొలిట్ బ్యూరో విమర్శించింది. అమిత్ షాను ప్రధాని మోడీ వెనకేసుకురావడం పూర్తిగా నిర్హేతుకమని పేర్కొంది. ఇటువంటి వ్యాఖ్యలు చేసిన అమిత్ షాకు హోం మంత్రి పదవిలో కొనసాగే హక్కు ఎంతమాత్రమూ లేదని పొలిట్ బ్యూరో తేల్చి చెప్పింది.

హోంమంత్రి వ్యాఖ్యలపై మీ వైఖరేమిటి?

నితీష్, చంద్రబాబును ప్రశ్నిస్తూ కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురించి హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై మీ వైఖరేమిటో చెప్పాలని బిజెపి మిత్రపక్షాలైన తెలుగుదేశం, జెడియు పార్టీలను ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సూటిగా ప్రశ్నించారు. గురువారం నాడు ఆ రెండు పార్టీల అధినేతలైన చంద్రబాబునాయుడు, నితీష్ కుమార్‌లకు ఆయన ఈ మేరకు ఒక లేఖ రాశారు. 'అంబేద్కర్...అంబేద్కర్...అంబేద్కర్...ఇప్పుడు ఈ మాట ఫ్యాషన్‌గా మారింది. దేవుడి పేరు తలచుకొని ఉంటే స్వర్గలోక ప్రాప్తి లభించేది....' అంటూ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. 'పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి అమిత్ షా చేసిన ప్రకటన యావద్దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది' అని కేజ్రీవాల్ ఆ లేఖలో తెలియజేశారు. అమిత్ షా వ్యాఖ్యలు రాజ్యాంగ నిర్మాతను కించపరచడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబేద్కర్‌ను కొలంబియా యూనివర్సిటీ 'డాక్టర్ ఆఫ్ లాస్' డిగ్రీతో సత్కరించిందని, ఆయన రచించిన రాజ్యాంగం సమాజంలోని అట్టడుగువర్గాల ప్రజలకు ఇతరులతోపాటు సమానహక్కులు కల్పించిందన్నారు. అటువంటి మహనీయుణ్ణి అగౌరవపరిచేలా మాట్లాడతారా అని బిజెపిని నిలదీశారు. అమిత్ షా వ్యాఖ్యలు లక్షలాది భారతీయుల మనోభావాలను గాయపరిచాయని, తన ప్రకటనకు క్షమాపణ చెప్పాల్సిందిపోయి ఆయన దానిని సమర్థించుకోజూడడం దారుణమని అన్నారు. అమిత్ షాను ప్రధాని మోడీ బాహాటంగా సమర్థించడం పుండు మీద కారం చల్లినట్లుగా ఉందన్నారు. 'అంబేద్కర్‌ను అభిమానించి ప్రేమించే వారు ఇంకెంత మాత్రం బిజెపిని సమర్థించబోరని ప్రజలు భావిస్తున్నారు. బాబాసాహెబ్ ఓ నాయకుడు మాత్రమే కాదు. భారత జాతి ఆత్మ. అంబేద్కర్‌పై బిజెపినేత చేసిన వ్యాఖ్యలపై మీరు తీవ్రంగా స్పందించాలని ప్రజలు కోరుకుంటున్నారు' అనిలేఖలో కేజ్రీవాల్ పేర్కొన్నారు.

10,128 గ్రామాల్లో రీసర్వే

- ముంపు ప్రాంతాల్లో రైతుల రుణాలు రీ షెడ్యూల్
- అమరావతికి 16వేల కోట్ల రుణం
- చాగంటితో విద్యార్థులకు ప్రవచనాలు
- కేబినెట్ నిర్ణయాలు



మంత్రిమండలి సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు కొనసాగింపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 10,128 గ్రామాల్లో భూముల రీ సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షత గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన ఈ రీసర్వే ప్రాజెక్టును పతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి తప్పుపట్టింది. తాజాగా అదే సర్వేను కొనసాగించాలని నిర్ణయించడం గమనార్హం. ఆగస్టు 30వ తేదీ తరువాత రాష్ట్రంలో చోటుచేసుకున్న భారీ వర్షాలు, వరదల్లో ముంపునకు గురైన ప్రాంతాల్లో రైతుల రుణాలను రీ షెడ్యూల్ చేయాలన్న ప్రతిపాదనకూ మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారుడు చాగంటి కోటేశ్వరరావుతో విద్యార్థులకు నైతిక విద్యపై ప్రచవనాలు చెప్పించాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. కార్పొరేట్ కళాశాలల సలహాలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వచ్చే ఏడాది నుంచి స్టడీ మెటీరియళ్లు తయారు మిగతా 7లో

సింగిల్ ఎంట్రీ విధానంలో

టోల్‌ఛార్జీలు రద్దు

- సిఆర్‌డిఎ పరిధిలో ఎత్తివేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 65 టోల్‌ప్లాజాల వద్ద సింగిల్ ఎంట్రీ విధానంతో వాహనదారులపై పెరిగిన అదనపు టోల్ రుసుముల భారాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టర్లకు టోల్ పేరుతో ప్రజల సొమ్ము కట్టబెడుతున్నా, రోడ్ల నిర్వహణ నాసిరకంగా ఉందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికితోడు ఆర్‌అండ్‌బి రోడ్లపై కూడా టోల్ ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి ప్రకటించా రని, ఇది పెనుభారం అవుతుందని తెలిపారు. దీన్ని సమీక్షించి తక్షణం భారాన్ని తగ్గించాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో మొత్తం 69 టోల్‌ప్లాజాలు ఉంటే 65లో సింగిల్ ఎంట్రీ విధానాన్ని తీసుకువచ్చారని తెలిపారు. రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు టోల్ వసూలు చేసే పద్ధతిలో వాహనదారులపై కేంద్రం భారాలు మోపుతోందని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల అద్దె వాహనాలు నడుపుకునే వారిపై తీవ్ర ప్రభావం పడి జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. రవాణా ఛార్జీలు పెరిగితే నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతాయని, రెండు నగరాల మధ్య రోజూ తిరిగే వాహనదారులకు మోయలేని భారం అవుతుందని పేర్కొన్నారు. విజయవాడ గుంటూరు నగరం మధ్య ఒకసారి వెళ్లి తిరిగి వచ్చినందుకు గతంలో రూ.160 చెల్లించే వారని, ఒకసారి టోల్ ఛార్జీ చెల్లించిన తరువాత 24 గంటల్లోపు ఎన్నిసార్లు తిరిగినా రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం రూ.160ని రూ.240కి పెంచారని, ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు రూ.240 చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అదే విధంగా సిఆర్‌డిఎ పరిధిలో టోల్‌ప్లాజాలు ఎత్తివేయాలని సిపిఎం డిమాండు చేసింది. గతంలో 20 కిలోమీటర్ల లోపు తిరిగే వాహనాలకు పసుపు, తెలుపు బోర్డుల పేరుతో పాస్‌లు ఇచ్చిన విషయాన్ని ఈ ప్రకటనలో వి.శ్రీనివాసరావు గుర్తుచేశారు. వీటికి నెలకు రూ.340 చెల్లిస్తే సరిపోయేదని పేర్కొన్నారు. ఇప్పుడు పసుపు బోర్డుకు పాస్‌లు పూర్తిగా రద్దు చేశారని, తెలుపుబోర్డు వాహనాలపై రుసుములు పెంచారని వివరించారు. దీనివల్ల సొంత వాహన దారులపై కూడా భారం పెరుగుతుందని వివరిం చారు. ఆర్‌టిసిపై అదనపు భారం పడుతుందని, ప్రజా రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. వెంటనే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు.

అమిత్‌షాకు చంద్రబాబు వత్తాసు

- మంచి ఉద్దేశమైనా... చెడు ప్రచారం.. అంటూ వ్యాఖ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'మంచి ఉద్దేశంతో మాట్లాడినా.. చెడుగా ప్రచారం చేసే వారుంటారు.' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర మంత్రులతో అన్నట్లు తెలిసింది. గురువారం కేబినెట్ సమావేశంలో అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యల అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు ఆయన ఈ విధంగా స్పందించినట్లు సమాచారం. 'వ్యవసాయం దండగ అని నేను అనకపోయినా, అన్నట్లు గతంలో నాపై ప్రచారం చేశారు... అంబేద్కర్ విషయంలో ఇప్పుడు ఢిల్లీలో జరుగుతోంది కూడా ఈ తరహాదే.. కాంగ్రెస్ హయాంలో అంబేద్కర్‌కు తగిన గౌరవం జరగలేదు, అంబేద్కర్ ఓడిపోయింది కూడా కాంగ్రెస్ హయాంలోనే.. పార్లమెంటులో అంబేద్కర్ విగ్రహాన్ని కూడా ప్రధానిగా విపి సింగ్ ఉన్న సమయంలో పెట్టారు... ఈ అంశం చర్చకు వస్తే అంబేద్కర్‌కు ఎవరి ద్వారా గుర్తింపు వచ్చిందన్న అంశంపై మాట్లాడండి' అని మంత్రులతో ఆయన చెప్పినట్లు తెలిసింది. సున్నితమైన అంశాలపై స్పందించేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

రాజధాని టెండర్లపై 'బ్యాంకు' సమీక్ష

- నోటిఫికేషన్, కేటాయింపులపై చర్చ
- కన్సల్టెన్సీల నియామకంపై ఆరా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతికి రుణం ఇవ్వనున్న ప్రపంచబ్యాంకు నేరుగా పనుల నిర్వహణలోనూ జోక్యం చేసుకుంటోంది. సిఆర్‌డిఎ అధికారులతో బ్యాంకు ప్రతినిధులు టెండర్లకు సంబంధించిన సమీక్షా సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిసింది. గురువారం జరిగిన ఈ సమావేశానికి సిఆర్‌డిఎ కమిషనర్ భాస్కర్ హాజరు కావాల్సిఉంది. ఆయన క్యాబినెట్ సమావేశానికి వెళ్లడంతో అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌తో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సమావేశమైనారు. ఇద్దరు బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నట్లు సమాచారం. టెండర్ల విధివిధానాలతోపాటు, కన్సల్టెన్సీల నియమాకంపై వారు ఆరా తీసినట్లు, కొన్ని సూచనలు చేసినట్లు సమాచారం. రాజధానిలో తొలివిడతలో చేపట్టనున్న మొత్తం 35 పనులకు సంబంధించి రూ.16,400 కోట్ల విలువైన టెండర్ల వివరాలను వారు తెలుసుకున్నారు. టెండర్ల నిబంధనలు ఆరా తీశారు. 'అమరావతికి ఫలితాల ఆధారిత రుణం' శీర్షికతో గురువారం ప్రజాశక్తి ప్రచురించిన వార్తా కథనంలో రాజధాని పనుల్లో ప్రపంచబ్యాంకు ఎలా జోక్యం చేసుకోనుందో వివరించిన సంగతి తెలిసిందే. ఆ కథనం ప్రచురించిన రోజే ఈ సమావేశం జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ తరహాలో రానున్న రోజుల్లో మరిన్ని సమీక్షా సమావేశాలను అధికారులతో ప్రపంచబ్యాంకు నిర్వహించనున్నట్లు తెలిసింది.

అధికారులు ఏం చెప్పారు?

ప్రపంచబ్యాంకు ప్రతినిధులకు ప్రాధాన్యత అంశాలను, చేసిన కేటాయింపులను అధికారులు వివరించారు. తొలుత నోటీస్ ఫర్ టెండరు (ఎన్‌ఐటి) పద్ధతిలో బిడ్డర్‌కు ఎటువంటి అర్హతలు ఉండాలనే అంశంపై స్పష్టత ఇస్తున్నామని చెప్పారు. పని విలువ, క్వాంటిటీ వంటి అంశాలను ముందుగానే నిర్ధారించిన నేపథ్యంలో ఏ స్థాయి అధికారికి ఎంత టెండరు అనుమతించేందుకు అధికారం ఉందనే అంశాలపైనా అదనపు కమిషనర్ వరల్డ్ బ్యాంకు ప్రతినిధులకు వివరించినట్లు తెలిసింది. పదికోట్ల విలువైన పనుల వరకు కమిషనర్, వంద కోట్ల విలువైన పనులకు ఎగ్జిక్యూటివ్ కమిటీ, వందకోట్లు పైన పనులకు అథారిటీ అనుమతులు తీసుకోవాల్సి ఉందని బ్యాంకు బృందానికి వివరించారు. సాంకేతిక అనుమతులకు సంబంధించి రూ.40 లక్షల వరకూ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, రెండుకోట్ల విలువైన పనుల వరకూ సూపరింటెండెంట్ ఇంజినీరు, అంతకుపైన చీఫ్ ఇంజినీరు అనుమతులు అవసరమనే విధంగా విభజన చేశామని చెప్పారు. పదికోట్లు విలువైన పనులకు పైబడిన వాటికి స్పెషల్ క్లాస్ కాంట్రాక్టరు, పదికోట్ల వరకూ క్లాస్-1 కాంట్రాక్టరు ఇలా స్థాయిలను బట్టి కేటాయింపులు జరిపినట్లు వివరించారు.

దల్లేవాల్‌కు వైద్య పరీక్షలు ఎందుకు నిర్వహించలేదు?

- పంజాబ్ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

7

భారత మార్కెట్లకు ఫెడ్ దెబ్బ

- సెన్సెక్స్ 965 పాయింట్ల పతనం
- రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి

3

కాకినాడ పోర్టులో బియ్యం లోడింగ్‌కు ప్రభుత్వం అనుమతి

2

దళితులపై విద్యుత్ భారం

- పాత బకాయిల పేరుతో వేలల్లో బిల్లులు
- కట్టకపోతే నిలిపివేస్తామంటూ బెదిరింపులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



'దళితులకు ఉచిత విద్యుత్ అన్నారు. ఎంతో సంబరపడ్డాం. తీరా ఇప్పుడు రూ.5,027 బిల్లు చేతిలో పెట్టారు. ఎట్టిపరిస్థితుల్లోనూ చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. బిల్లు కట్టకపోతే కరెంటు సరఫరా నిలిపివేస్తామని బెదిరిస్తున్నారు. ఇంతమొత్తం ఇప్పటికిప్పుడు ఎలా కట్టగలం.?'

ఇది గజపతినగరం మండలం బంగారమ్మపేటకు చెందిన కంటు అప్పయ్యమ్మ అనే దళిత వృద్ధురాలి ఆవేదన.



'మేము ఇద్దరు అన్నదమ్ములం. తల్లి కంటు పోలమ్మ పేరున ఉన్న మీటరుపైరూ.7,500 వరకు బిల్లు వచ్చింది. ఇదే ఇంట్లో ఇద్దరం వేరుకాపురం పెట్టడంతో ఆరు నెలల క్రితం కొత్తగా మరో మీటరు కోసం దరఖాస్తు చేశాం. బిల్లులో సగం రూ.3,500 చెల్లిస్తే తప్ప మీటరు ఇవ్వలేదు. మిగిలిన రూ.3 వేలు కలుపుకుని ఇప్పుడు రూ.5,179 బిల్లు చేతిలో పెట్టారు. ఇదెక్కడి న్యాయం'

- లక్ష్మణరావు అనే మరో దళితుడి వ్యధ



ఇది కేవలం గజపతినగరం మండలంలోని బంగారమ్మపేటలోని అప్పయ్యమ్మ, లక్ష్మణరావు ఆవేదన మాత్రమే కాదు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా దళితులందరిదీ ఇదే పరిస్థితి. వేలవేల రూపాయల బిల్లులు చేతిలో పెట్టి, తక్షణమే కట్టకపోతే కరెంటు సరఫరా నిలిపివేస్తామని బెదిరిస్తుండటంతో ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో వీరు చిక్కుకున్నారు.

ఏం జరిగింది...?

2019కు ముందు వరకు దళితులకు 70 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన సంగతి తెలిసిందే. 2019లో మరోసారి తనను గెలిపిస్తే 100యూనిట్లు ఉచితంగా ఇస్తామని కూడా టిడిపి అప్పట్లో హామీ ఇచ్చింది. తనను గెలిపిస్తే 200 యూనిట్ల వరకు ఉచితమేనని జగన్ హామీ గుప్పించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత విద్యుత్ పాలసీ అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే, సర్ ఛార్జీ పేరిట నెలకు రూ.25 చొప్పున బిల్లులను నాటి వైసిపి ప్రభుత్వం ఇచ్చింది. దీనికితోడు విద్యుత్ వినియోగం 200 యూనిట్లు దాటితే వాడిన మొత్తం యూనిట్లకు కూడా బిల్లులు జనరేట్ చేశారు. ఈ మొత్తాలను వసూలు చేయక పోయినప్పటికీ, బిల్లులను తయారు చేయడంతో అవి పాతబకాయిలుగా రికార్డుల్లో కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఈ పాత బకాయిల మొత్తాన్ని ఒకే సారి కట్టాలంటూ విద్యుత్ శాఖ నోటీసులు జారీ చేసి, వసూళ్లకు దిగుతోంది.

బిల్లులు మాఫీ చేయాలి

దళితులందరికీ ఉచిత విద్యుత్ మిగతా 2లో

డాలర్@85

- రూపాయి చారిత్రాత్మక పతనం

న్యూఢిల్లీ : అధికారంలోకి వస్తే అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువను పడిపోనివ్వబోమని, రూపాయి కరెన్సీ కోసం విదేశాలు లైన్ కట్టాలని నరేంద్ర మోడీ 2013లో ఇచ్చిన హామీ ప్రచార ఆర్భాటమేనని మరోసారి రుజువైంది. రూపాయి చరిత్రలోనే అత్యంత కనిష్టంగా మారకం విలువ 14 పైసలు పతనమై 85.08కి దిగజారింది. ఇంటర్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో గురువారం ఉదయం 85 వద్ద ప్రారంభమైంది. ఇంతక్రితం సెషన్‌లోనూ 3 పైసలు కోల్పోయి 84.94 వద్ద ముగిసింది. అక్టోబర్ ముగింపు నాటికి రూపాయి విలువ 82.71గా ఉంది. నవంబర్ నెలలోనే 0.5 శాతం విలువ కోల్పోయింది. రూపాయి విలువ పుంజుకోకపోవడంతో ఆర్‌బిఐ వద్ద ఉన్న విదేశీ మారకం నిల్వలు భారీగా కరిగిపోతున్నాయి. మోడీ ప్రధాని కాకముందు 2014లో డాలర్‌తో రూపాయి విలువ 60లోపే ఉంది. అమెరికా ఎన్నికల్లో ట్రంప్ విజయం తర్వాత డాలర్ విలువ పెరగడం, భారత మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో నిధులు తరలిపోవడంతో రూపాయి విలువ భారీగా పడిపోయింది.



విద్యార్థులకు పాఠాలు వివరిస్తున్న కలెక్టర్ నాగరాణి

టీచర్‌గా కలెక్టర్ మారిన వేళ!

పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం పాందువ్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం టీచర్ అవతారమెత్తారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతోపాటు బెంచ్ మీద కూర్చుని వారితో పాఠాలు చదివిస్తూ, తప్పులు సరి చేస్తూ విద్యార్థులతో మమేకమయ్యారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులను పేర్లు అడిగి తెలుసుకుని వారితో పాటలు పాడించారు.

- ప్రజాశక్తి, ఉండి

అమిత్‌షా వ్యాఖ్యలకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను కించపరిచేలా, దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీసిన కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగ రూపశిల్పి అయిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురించి అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేయడం గర్హనీయమని తెలిపారు. దీంతో ఆయన మనువాద దృక్పథాన్ని బయటపెట్టారని, అమిత్‌షాకు హోమ్‌మంత్రిగా కొనసాగే హక్కులేదని సిపిఎం భావిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర వాదులు, మేధావులు, లౌకిక, సామాజికవాదులు సంఘాలు నిరసనలు తెలియజేయాలని ఆయన కోరారు.

కెటిఆర్‌పై నాలుగు కేసులు

- ఫార్ములా-ఇ కార్ రేసింగ్ కేసులో ఎసిబి నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్‌పై ఫార్ములా-ఇ కార్ రేసింగ్‌కు సంబంధించి ఎసిబి అధికారులు నాలుగు కేసులు నమోదు చేశారు. కెటిఆర్‌తో పాటు అప్పటి హెచ్ఎండిఎ కమిషనర్, సీనియర్ ఐఎఎస్ అధికారి, ప్రస్తుత ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, హెచ్ఎండిఎ చీఫ్ ఇంజినీర్ బిఎల్ఎన్‌రెడ్డి పైనా కేసులు నమోదయ్యాయి. ఫార్ములా-ఇ కార్ రేసింగ్‌కు సంబంధించి భాగస్వాములైన దాదాపు నాలుగు కంపెనీల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో ఎసిబి నమోదు చేసింది. ఈ కేసులో సమగ్రంగా దర్యాప్తు సాగించడానికి ఎసిబిలో దాదాపు 45 మందికి పైగా అధికారులు, సిబ్బందితో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను ఆ విభాగం అధిపతి విజయ్‌కుమార్ ఏర్పాటు చేశారు. ఒకట్రెండ్రోజుల్లో కెటిఆర్‌తో పాటు ఇతర అధికారులకు ఎసిబి నుంచి నోటీసులు వెళ్లనున్నట్టు తెలిసింది. మొదట కిందిస్థాయి అధికారులను, తర్వాత మాజీ సిఇఒను, తర్వాత అరవింద్ కుమార్‌ను ఎసిబి విచారించే అవకాశమున్నదని సమాచారం. తాను ఎలాంటి ముందస్తు బెయిల్‌ను కోరననీ, న్యాయపోరాటానికి సిద్ధమవుతానని ఇప్పటికే విలేకరులతో పాటు తన సహచరులకు కెటిఆర్ స్పష్టం చేశారు.

ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం

- మంత్రి ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెలకు రూ.5 వేలు కంటే తక్కువ ఆదాయం ఉన్న మసీదు ఇమాములు, మౌజన్‌లకు గౌరవ వేతనాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఇందుకు సంబంధించి మైనార్టీ సంక్షేమశాఖ గురువారం ఉత్తర్వులు విడుదల చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలోని 5 వేల మసీదుల్లో ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేలు గౌరవ వేతనం చెల్లించడం కొనసాగుతుందని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ చెల్లింపు అమలు చేస్తారన్నారు. ఇందుకు ఏడాదికి రూ.90 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

న్యాయశాఖ పనితీరుపై సమీక్ష

రాష్ట్రంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టుల పనితీరుపై రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో తన పేషీలో గురువారం జరిగిన సమీక్షలో న్యాయశాఖ కార్యదర్శి జి ప్రతిభాదేవి న్యాయస్థానాల పనితీరు, కేసుల పురోగతి తదితర అంశాలను ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. న్యాయస్థానాల భవన నిర్మాణ పనుల పురోగతి, తదితర అంశాలపైనా చర్చించారు.

చెవిరెడ్డి పేరు తొలగింపుపై రభస

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

మహిళా భవనంపై ఉన్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరును విశ్రాంత ఉద్యోగులు గురువారం తొలగించారు. దీంతో స్థానిక వైసిపి సానుభూతిపరులకు, విశ్రాంత ఉద్యోగుల మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. చంద్రగిరి పట్టణంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళల కోసం మహిళా భవనం నిర్మించారు.

ఆ మహిళా భవనం ప్రారంభోత్సవం సందర్భంగా స్లాబ్ ముందర అప్పటి ఎమ్మెల్యే ప్రారంభకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేరును సిమెంటుతో ఏర్పాటు చేశారు. ఆ భవనాన్ని ప్రస్తుతం విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల కోసం కేటాయించారు. భవనం ముందు ఇనుప రేకులను అమర్చుకునే క్రమంలో చెవిరెడ్డి పేరును తొలగించడంతో వివాదం మొదలయ్యింది. ఇది మహిళా భవనమని, ఆ పేరును ఎందుకు తొలగిస్తారని మహిళలు విశ్రాంత ఉద్యోగులపై తిరగబడ్డారు. రేకులు బిగించేందుకు ఇనుప క్యాంపులను బిగించేందుకు పేరు తొలగించామే తప్ప వేరే ఉద్దేశం ఏం లేదని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వివరించారు.

దళితులపై విద్యుత్ భారం

మొదటి పేజి తరువాయి

పథకం అమలులో ఉన్న నేపథ్యంలో వారికి ఇచ్చిన విద్యుత్ బిల్లులన్నీ మాఫీ చేయాలి. ఓవైపు ఉచితం అంటూ సర్ ఛార్జీల పేరిట బిల్లులు ఇవ్వడం సరికాదు. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు పరిమితి విధించిన నేపథ్యంలో అంతకు మించి వినియోగించినప్పుడు అదనపు వినియోగానికి మాత్రమే ఛార్జీలు విధించాలి. అలా కాకుండా వినియోగం మొత్తానికి ఛార్జీ వేయడం సరికాదు. బిల్లులు చెల్లించాలనే ఒత్తిడి మానుకోకపోతే దళితులందర్నీ సమీకరించి పోరాడుతాం.

-గొర్లె శ్రీనివాసరావు,
సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనలు
- పలుచోట్ల కేంద్ర హోం మంత్రి చిత్రపటాలు దగ్ధం
- అమిత్ షాకు ప్రధాని మద్దతు శోచనీయం : మిడియం బాబూరావు



విశాఖలో మాట్లాడుతున్న ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కో కన్వీనర్ డాక్టర్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సమావేశంలో అవమానపరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, కెవిపిఎస్, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళలు చేపట్టారు. పలుచోట్ల అమిత్ షా చిత్రపటాలను తగలబెట్టారు. ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అమిత్ షాపై చర్యలు తీసుకునే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.

విశాఖ జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయం నుంచి డాబాగార్డెన్స్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ఆదివాసి గిరిజన సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కో కన్వీనర్ డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడుతూ.. కేంద్ర హోం మంత్రికి మద్దతుగా ప్రధాన మంత్రి మాట్లాడటాన్ని తీవ్రంగా విమర్శించారు. తక్షణమే మంత్రి పదవి నుండి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పాల్గొన్నారు. నర్సీపట్నంలో కెవిపిఎస్, అనకాపల్లిలో సిపిఎం ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసన తెలిపారు. అనంతపురంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప మాట్లాడుతూ.. రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో అంబేద్కర్‌ను కించపరుస్తూ, దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు, కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామంలో కెవిపిఎస్ ఆధ్వర్యాన అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేశారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో, కాకినాడ అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. కర్నూలులోని సుందరయ్య జంక్షన్‌లో సిపిఎం నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో విసికె పార్టీ ఆధ్వర్యంలో అమిత్ షా చిత్రపటాలను దహనం చేశారు.

ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో, నెల్లూరు జిల్లా కావలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో, ఉండి మండలం పాందువ్వలో ఆందోళనలు నిరసన తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో, టి.నర్సాపురంలో కెవిపిఎస్, ఆగిరిపల్లి మండలం చిన్నాగిరిపల్లి, తోటపల్లి గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి, అమరావతి, గుంటూరు లాడ్జి సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలో ప్రజాసంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.


ప్రదర్శన నిర్వహిస్తున్న పేదలు

పేదలకు ఇళ్లస్థలాలివ్వాలి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయవాడ

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం పి నైనవరం గ్రామ పరిధిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పేదలు గురువారం ఆందోళన చేపట్టారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుండి వందలాది మంది ప్రదర్శనగా వెళ్లి రెవెన్యూ సదస్సులో అధికారులను సమస్య పరిష్కారానికి తీర్మానం చేయాలని నిలదీశారు. దీంతో అధికారులు లిఖితపూర్వకమైన హామీ నిచ్చారు. ఈ సందర్భంగా వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామానికి సుమారు ఎనిమిది కిలో మీటర్ల దూరంలో ఉన్న పాతపాడు లేఅవుట్‌లో ఇళ్లపట్టాలు ఇచ్చారని, పిల్లలు చదువులకు విజయవాడ వెళ్లాల్సి ఉంటుందని, రోజువారి పనులు చేసుకునే పేదలకు ఇబ్బందికరంగా ఉన్నందున పి నైనవరాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పాకలు వేసుకుని పేదలు నివాసం ఉంటారని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ మాట్లాడుతూ ఇచ్చిన పట్టాలు ఇళ్ల స్థలాలు ప్రజలకు అనుకూలంగా లేనందున గ్రామ పరిధిలోని ఆర్ఎస్ నెంబర్ 50-1లో ఉన్న 27 ఎకరాల్లో సుమారు పది ఎకరాలు ఇళ్లస్థలాలకు కేటాయించాలని కోరారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అనుకూలంగా ఉన్న స్థలాలలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తమ వంతు కృషి చేస్తానని రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు మాతంగి ఆంజనేయులు, వృత్తిదారుల సంఘం నాయకులు సత్తు శ్రీనివాసరావు, సురేష్, జమున, రాణి, కళావతి, దావు శ్రీనివాసరావు బాజీ, చిన్నా, రాంబాబు, మల్లేశ్వరరావు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

30 వరకు సభ్యత్వ నమోదు

- పూర్తి చేయాలని టిడిపి నేతలకు సిఎం చంద్రబాబు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోపు పూర్తిచేయాలని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ పార్టీ నేతలను ఆదేశించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులతో గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో టిడిపి సభ్యత్వం 76,89,103 మంది తీసుకున్నారని చెప్పారు. సభ్యత్వం తీసుకున్నవారికి జనవరి నుంచి బీమా అమలవుతుందన్నారు. దేశంలోనే చరిత్ర సృష్టించామని, ప్రతి నలుగురిలో ఒకరు పార్టీ సభ్యులుగా చేరాలనుకుంటున్నారని తెలిపారు. 685 మంది శాశ్వత సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. మెజార్టీ ప్రభుత్వ నామినేటెడ్ పదవులను ఇప్పటికే భర్తీ చేశామని, మిగిలిన వాటిని త్వరలో భర్తీ చేస్తామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకోవడంతోపాటు మెరిట్ ప్రకారం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పదవులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. నీరు-చెట్టు కింద పనుల బిల్లుల సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. సూపర్-6 పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఆరు నెలల కాలంలో అనేక సవాళ్లు, అవరోధాలు ఉన్నా మంచి ఫలితాలు సాధించామన్నారు.

డోలీ ఆవాసాలకు రూ.49.73 కోట్లతో రోడ్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లోని ఆవాసాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం రూ.49.73 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులు అందించిన ప్రతిపాదలను పరిశీలించిన ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 6 ఆవాసాలకు, పార్వతీపురం మన్యం జిల్లాలో 3 ఆవాసాలకు రోడ్లు లేకపోవడం వల్ల డోలీ ఆవాసాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ 9 ఆవాసాలకు రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఇందుకు 48.85 కిలోమీటర్ల మేర బిటి రోడ్లను పంచాయతీరాజ్‌శాఖ పర్యవేక్షణలో నిర్మించనున్నారు.

4న నావికాదళ విన్యాసాలు

- హాజరు కానున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఏటా డిసెంబర్ 4న జరిగే నేవీ డేను పురస్కరించుకొని దానికి అనుబంధంగా జనవరి 4న విశాఖ వేదికగా నిర్వహించనున్న నావికాదళ విన్యాసాలకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భాగస్వామ్యం కానున్నారని తెలిపారు. అన్ని విభాగాల అధికారులూ సమన్వయంతో వ్యవహరించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని, అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రధాన వేదిక సమీపంలో గ్రీన్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని, వేడుకలను సౌకర్యవంతంగా వీక్షించేలా ఎక్కడికక్కడ ఎల్ఇడి. స్క్రీన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జనవరి 4వ తేదీ సాయంత్రం ఆర్‌కె బీచ్ ప్రాంతంలో ఒపి డెమో జరుగుతుందని, వాటితో పాటు లేజర్ షో, డ్రోన్ షో, నౌకలపైనుంచి విన్యాసాలు కూడా ఉంటాయని నేవీ అధికారులు తెలిపారు. జనవరి 2న ఫుల్ రిహార్సల్స్ జరుగుతాయని చెప్పారు. నేవీ తరపున అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని, కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, డిసిపి అజిత, కమాండర్లు వైకె.కిషోర్, మనోజ్‌కుమార్, లెఫ్టినెంట్ కమాండర్లు సంజీబ్ శరణ్, ఉజైర్ కుస్రో, డిఆర్ఒ బిహెచ్.భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

క్రీడలకు ఆధునిక సాంకేతిక హంగులు

క్రీడా యాప్ ఆవిష్కరణలో మంత్రి రామ్‌ప్రసాద్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్రీడాకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందించే దిశగా రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలు చేపడుతున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. క్రీడా యాప్, పాలసీలను విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం ఆయన విడుదల చేశారు. క్రీడా సంఘాలకు, క్రీడాకారులకు క్రీడా పోటీల సమాచారానికి సంబంధించిన సమగ్రమైన సమాచారాన్ని అందించే దిశగా యాప్‌ను ఆవిష్కరించామని తెలిపారు. ఈ యాప్ ద్వారా క్రీడాకారులకు మెరుగైన సేవలు ఎలా అందించాలో చంద్రబాబు నాయకత్వంలో చర్యలు తీసుకుంటామన్నారు. అమరావతి కేంద్రంగా 2027లో జాతీయ క్రీడా పోటీలు నిర్వహించే విధంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. విద్యాశాఖ, క్రీడా శాఖల అనుసంధానంతో గ్రామీణ స్థాయిలో ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ.. క్రీడాకారులకు డిజిటల్ సర్టిఫికెట్స్ అందించడం నూతన విధానానికి అంకురార్పణ అని అన్నారు. రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు పాలసీ ఉపయోగపడుతుందన్నారు. నకిలీ సర్టిఫికెట్లను అరికట్టడానికి యాప్ ఒక సాధనమని చెప్పారు. రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి ఒక మంచి పాలసీ తీసుకొచ్చామని క్రీడా శాఖ కార్యదర్శి వినయ్ చంద్, శాప్ ఎమ్‌డి గిరీషా అన్నారు. ఒలింపిక్స్‌లో పతకాలు తీసుకొచ్చే క్రీడాకారులకు రాష్ట్రప్రభుత్వం రూ.7 కోట్లు ప్రకటించడం ప్రోత్సాహకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ, కరాటే క్రీడాకారిణి పూజ తదితరులు పాల్గొన్నారు.

ఐపిఎస్‌ల ముందస్తు బెయిల్ పిటిషన్లపై తీర్పు వాయిదా

- పిఎస్ఆర్ ఆంజనేయులును ఎందుకు అరెస్టు చేయలేదు : హైకోర్టు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి

సినీ నటి కాదంబరి జత్వాని ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో 2వ నిందితుడు ఐపిఎస్ అధికారి, గత ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులును ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలని రాష్ట్రాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేయనప్పుడు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించింది. అందుబాటులో ఉన్నారా లేక పారిపోయారా అని ప్రశ్నించింది. దీనిపై ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ జోక్యం చేసుకుని, ఆంజనేయులు ముందస్తు బెయిల్ పిటిషన్ వేయనందున ఇతర నిందితులు ముందస్తు బెయిల్ కోరడానికి వీల్లేదన్నారు. ఎవరిని అరెస్టు చేయాలో దర్యాప్తు అధికారి విచక్షణపై ఆధారపడి ఉంటుందన్నారు. అవసరమైతే అరెస్టు చేస్తారన్నారు. సినీనటి కాదంబరి జత్వాని ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఐపిఎస్ అధికారులు క్రాంతిరాణా టాటా, విశాల్ గున్ని, విజయవాడ గత ఎసిపి హనుమంతురావు, దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు వేర్వేరుగా పిటిషన్లు వేశారు. వీటిని గురువారం జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ విచారించారు. విచారణకు హాజరుకావాలని పిటిషనర్లకు ఇప్పటివరకు నోటీసులు ఇవ్వలేదని న్యాయవాదులు చెప్పారు. పోలీసుల కౌంటర్‌లో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆలస్యానికి కారణం చెప్పలేదన్నారు. కస్టోడియల్ విచారణ అవసరం లేదన్నారు. ఈ వాదనలను జత్వాని తరపున న్యాయవాది వ్యతిరేకించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.


సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, ఉద్యోగులు

విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణను నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ

చండీఘర్, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆగ్రా, వారణాసి డిస్కమ్‌లు ప్రయివేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విజయవాడ విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు గురువారం ధర్నా నిర్వహించారు. గత కొన్ని రోజులుగా విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఆ రాష్ట్రంలో ఆందోళనలు చేస్తున్న క్రమంలో వారికి సంఘీభావంగా నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ పిలుపు మేరకు విజయవాడలో విద్యుత్ సర్కిల్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన సమయంలో ఆందోళన చేపట్టారు. ఎపి స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెఎసి జిల్లా నాయకులు కమలాకర్, సురేష్, కమలరాజు, వెంకటేశ్వరరావు, కొండలరావు, రాజశేఖర్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం కార్యదర్శి ఎల్.రాజు మాట్లాడుతూ చండీఘర్, ఉత్తర్‌ప్రదేశ్ డిస్కమ్‌ల ప్రయివేటీకరణ చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు.

ఉచ్చులో చిక్కి చిరుత మృతి

- గోళ్లు మాయం

ప్రజాశక్తి- గన్నవరం

కృష్ణా జిల్లా గన్నవరం మండలం మెట్లపల్లి అటవీ ప్రాంతానికి సమీపంలోని జామ తోటకు వేసిన ఉచ్చులో చిక్కుకొని చిరుత పులి మృతి చెందింది. దీని కాళ్ల గోర్లు మాయమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... మెట్లపల్లి గ్రామానికి చెందిన నవీన్ అనే రైతు తన జామ తోటకు అడవి పందుల నుంచి రక్షణకు ఉచ్చు ఏర్పాటు చేశారు. ఈ తోటకు సమీపంలోని చెట్లు కొట్టేందుకు వెళ్లిన మల్లేశ్వరరావు అనే కార్మికుడు చిరుత పులిని చూసి భయపడి గ్రామంలోకి పరుగున చేరుకొని గ్రామస్తులకు విషయం తెలియజేశారు. గ్రామ పెద్దలు అటవీ శాఖాధికారులకు, పోలీసులకు సమాచారమిచ్చారు.

అందరూ కలిసి అక్కడకు వెళ్లి చూడగా ఉచ్చులో చిరుత పులి మృతి చెంది ఉంది. దీని నాలుగు కాళ్ల గోర్లు కనిపించలేదు. పులి గోర్లకు మార్కెట్లో అధిక డిమాండ్ ఉండడంతో వీటిని గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించి అపహరించుకుపోయి ఉంటారని పోలీసులు, అటవీ అధికారులు భావిస్తున్నారు. చిరుత పులి కళేబరాన్ని జిల్లా అటవీ శాఖ అధికారిణి సునీత పరిశీలించారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో పోస్టుమార్టం అనంతరం చిరుత పులిని దహనం చేశారు. గతంలో ఈ ప్రాంతంలో చిరుత పులి తిరిగినట్లు ఆధారాలు లేవని సునీత తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కాకినాడ పోర్టులో బియ్యం లోడింగ్‌కు ప్రభుత్వం అనుమతి

ప్రజాశక్తి-అమరావతి

కాకినాడ పోర్టులో పారా బాయిల్డ్ రైస్‌ను ఓ నౌకలో లోడ్ చేసేందుకు అనుమతించాలంటూ దాఖలైన మూడు పిటిషన్లను పిటిషనర్లు వెనక్కి తీసుకున్నారు. ఇందుకు హైకోర్టు అనుమతినిచ్చింది. గురువారం అడిషనల్ అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్ వాదిస్తూ, పారా బాయిల్డ్ బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు పిటిషనర్లకు అన్ని అనుమతులూ ఉన్నాయని చెప్పారు. అక్రమ రవాణా చేస్తున్న 1,320 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని స్టెల్లా నౌక నుంచి అన్లోడ్ చేస్తున్నామని, ప్రక్రియ ముగిసిన అనంతరం పిటిషనర్లకు చెందిన పారా బాయిల్డ్ రైస్ నౌకలో లోడ్ చేసుకోవచ్చు తెలిపారు. తొలుత పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్ శ్రీనివాసరెడ్డి వాదిస్తూ, అధికారులతో చర్చల తర్వాత నౌకలో బియ్యాన్ని లోడ్ చేసేందుకు అనుమతినిచ్చారని, పిటిషన్లను వాపస్ తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇందుకు అనుమతినిస్తూ జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం ఆదేశాలు జారీ చేశారు. నౌకలో బియ్యాన్ని లోడ్ చేయకుండా అడ్డుకునే అధికారం రాష్ట్రానికి ఎక్కడ ఉందో చెప్పాలని గత విచారణలో ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన విషయం విదితమే.

భార్గవ్‌రెడ్డికి నోటీసులిచ్చి విచారణ చేయండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియా పోస్టింగ్‌లకు సంబంధించిన కేసులో వైసిపి సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ్ రెడ్డికి బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులివ్వాలని పోలీసులను ఆదేశించింది. సుప్రీంకోర్టు అర్నేష్ కుమార్ కేసులో జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయాలని పేర్కొంది. ఫిర్యాదుదారులకు నోటీసులిచ్చింది. విచారణను ఫిబ్రవరి తొలి వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ బివిఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు, భీమవరం 1 టౌన్ పోలీసులు, సిఐడి పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టేయాలంటూ భార్గవ్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలి

- ముఖ్యమంత్రిని కోరిన సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలకు భారంగా మారిన సెకీ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఐ కోరింది. ఈ మేరకు సిఎం చంద్రబాబును సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు గురువారం నాడు సచివాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలకు సంబంధించి ముడుపులు చేతులు మారడంతోపాటు, సెకీ ఒప్పంద నియమాలను ఉల్లంఘించినందున రద్దు చేయడానికి ఆస్కారం ఉందని, దీనిపై న్యాయ సలహా తీసుకుని రాష్ట్ర ప్రజలపై పడే విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని కోరారు. సౌర విద్యుత్ ధరలు క్రమంగా తగ్గుతున్నందున ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి, డిస్కంలకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు.

హాస్టళ్ల తనిఖీ కోసం ప్రత్యేక యాప్

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి వసతి గృహాల పనితీరును మెరుగుపరచడానికి తనిఖీల కోసం యాప్‌ను రూపొందిస్తున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ డైరీ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయం నుంచి వసతి గృహాల నిర్వహణ-విద్యార్థుల భద్రతపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా అధికారులు తరచూ వసతి గృహాలను తనిఖీ చేయాలని ఆదేశించారు.

త్వరలో అందుబాటులోకి తీసుకురానున్న యాప్‌లో ఇప్పటి వరకూ తనిఖీ చేసిన వసతి గృహాల వివరాలు నమోదు చేయాలని సూచించారు. వసతి గృహాల్లో పారిశుధ్య చర్యలకు అవసరమైతే స్థానిక సంస్థల సిబ్బంది సహాయం తీసుకోవాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లు పారదర్శకంగా ఉండాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సాయంతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వేడి ఆహారంతోపాటు గోరువెచ్చని తాగునీటిని మాత్రమే విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో పోలీసులు హాస్టల్ చుట్టుపక్కల పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెన్త్ పరీక్షల్లో బిసి హాస్టళ్ల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. సిఎస్ఆర్ ఫండ్స్ కోసం కలెక్టర్ల సాయంతో జిల్లాల్లోని పరిశ్రమల నుంచి నిధులు సేకరించాలని కోరారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై వసతి గృహ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో బిసి సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున, అదనపు సహాయ సంచాలకులు చంద్రశేఖర్ రాజు, జెడి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత మార్కెట్లకు ఫెడ్ దెబ్బ

- సెన్సెక్స్ 965 పాయింట్ల పతనం
- రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబయి : భారత స్టాక్ మార్కెట్లపై అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పిడుగు పడింది. మరోవైపు దేశీయంగా ఎలాంటి సానుకూల ఆర్థిక సంకేతాలు కానరాకపోవడంతో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 964 పాయింట్లు లేదా 1.20 శాతం పతనమై 79,218కి పడిపోయింది. ఇంట్రాడేలో ఈ సూచీ 79,516.70- 79,218.05 పాయింట్ల మధ్య కదలాడింది. బిఎస్ఇ బాటలోనే ఎన్ఎస్ఇ నిఫ్టీ 247 పాయింట్లు నష్టంతో 23,952కు దిగజారింది. ఇంట్రాడేలో 24,005-23,870 మధ్య కదలాడింది. నిఫ్టీ-50లో 36 సూచీలు నష్టాలను చవి చూశాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్ సర్వ్, ఏషియన్ పెయింట్స్, జెఎస్ డబ్ల్యు స్టీల్, గ్రాసిమ్ తదితర స్టాక్స్ 2.33 శాతం వరకు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్, సిప్లా, బిపిసిఎల్, సన్ ఫార్మా, అపోలో హాస్పిటల్ తదితర 14 స్టాక్స్ 4.04 శాతం వరకు పెరిగి అధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. మిడ్‌క్యాప్ 0.28 శాతం, స్మాల్ క్యాప్ 0.51 శాతం చొప్పున నష్టపోయాయి. బ్యాంక్ స్టాక్స్, ఐటి, ఫైనాన్సియల్ సర్వీసెస్, కన్జూమర్ డ్యూరబుల్స్, మెటల్ తదితర సూచీలు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. తాజాగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ 25 బేసిస్ పాయింట్లు మేర కీలక వడ్డీ రేట్లను తగ్గించినట్లు ప్రకటించింది. వచ్చే 2025లో మూడు, నాలుగు సార్లు రేట్ల కోతలను మార్కెట్లు అంచనా వేయగా.. కేవలం రెండుసార్లు మాత్రమే కోత ఉండొచ్చంటూ ఫెడ్ సంకేతాలు ఇవ్వడం మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. ఫెడ్ నిర్ణయంతో నిన్న అమెరికా ప్రధాన సూచీలైన ఎస్అండ్‌పి 500, నాస్‌డాక్ భారీ నష్టాల్లో ముగిశాయి. దీని ప్రభావం భారత మార్కెట్లతో పాటు ఇతర ప్రధాన మార్కెట్లపైనా పడింది. దేశీయంగా ఒక్క పూటలోనే మదుపర్ల సంపద రూ.3 లక్షల కోట్లు హరించుకుపోయింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.450 లక్షల కోట్లకు పడిపోయింది. విదేశీ సంస్థాగత మదుపర్లు గత మూడు సెషన్లలో దాదాపు రూ.8వేల కోట్లను భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకున్నారు.

బార్జీ నుంచి వెయ్యి మెట్రిక్ టన్నుల బియ్యం అన్‌లోడ్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ యాంకరేజ్ పోర్ట్‌లోని బార్జీలో ఉన్న వెయ్యి మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని గురువారం సాయంత్రం అన్‌లోడ్ చేశారు. పోర్టు అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు పర్యవేక్షణలో అన్‌లోడింగ్ నిర్వహించారు. ఈ నెల 17న కాకినాడ కలెక్టర్ షెన్‌మోహన్ నిర్వహించిన స్టెల్లా ఎల్ నౌకలో 1,320 టన్నుల పిడిఎస్ బియ్యం ఉన్నట్లు నిర్ధారించినట్టు ప్రకటించారు. వీటిని అన్‌లోడింగ్ చేసి సీజ్ చేస్తామని చెప్పారు. అందులో భాగంగానే గురువారం అన్‌లోడింగ్ ప్రక్రియను చేపట్టారు. ఈ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ గొడౌన్లకు తరలించనున్నారు. గత నెల 29న కాకినాడ పోర్టులో రేషన్ బియ్యాన్ని కలెక్టర్ షాన్‌మోహన సగిలి పట్టుకున్నారు. తొలుత 650 టన్నుల బియ్యాన్ని గుర్తించారు. అనంతరం డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి షిప్‌ను తనిఖీ చేశారు. షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఐదు శాఖల అధికారులతో మల్టీ డిసిప్లినరీ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ బృందం నౌకలో మొత్తం బియ్యాన్ని పరిశీలించి నమూనాలు సేకరించింది. ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షలో పిడిఎస్ బియ్యంగా నిర్ధారణ అయ్యింది. దీంతో, ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



బార్జీ నుంచి అన్‌లోడింగ్ చేస్తున్న పిడిఎస్ బియ్యం బస్తాలు



ఇఎస్ఐ ఆస్పత్రిని పరిశీలిస్తున్న సిహెచ్.నర్సింగరావు తదితరులు

విశాఖలో ఇఎస్ఐ మెడికల్ కాలేజీ

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు డిమాండ్

ప్రజాశక్తి -గాజువాక (విశాఖపట్నం)

విశాఖపట్నంలో నిర్మిస్తున్న ఇఎస్ఐ హాస్పటల్‌కు అనుబంధంగా మెడికల్ కాలేజీని నిర్మించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. విశాఖ షీలానగర్‌లో నిర్మిస్తున్న 500 పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, గాజువాక నాయకులు ఎం.రాంబాబు, ఎన్.రాజేంద్రప్రసాద్, ఎస్.రమణతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. ఇఎస్ఐ మెడికల్ కాలేజీని అమరావతిలో పెడుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారని, దానికి బదులు విశాఖలోనే ఏర్పాటు చేయాలని కోరారు. విశాఖలో ఇఎస్ఐ కార్డు హోల్డర్లు 5 లక్షల మంది ఉన్నారని తెలిపారు. పారిశ్రామిక కేంద్రమైన విశాఖలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇఎస్ఐ 500 పడకల ఆస్పత్రి విశాఖలో నిర్మిస్తున్నందున ఇక్కడే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరారు. ఎక్కడైనా ఆస్పత్రికి అనుబంధంగానే మెడికల్ కాలేజీ ఉంటుందని గుర్తు చేశారు. ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం కోసం అనేక పోరాటాలు చేశామని, అలాగే పోరాడి మెడికల్ కాలేజీని కూడా సాధించుకుంటామని తెలిపారు.

రచయిత 'వియోగి' కన్నుమూత

- సాహితీ స్రవంతి సంతాపం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్



ప్రముఖ కథ, హాస్య కథ, నవలా రచయిత కోపల్లె విజయప్రసాద్ (72) మరణించారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధితో కర్నూలులోని కిమ్స్ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. ఆయన తండ్రి శ్రీరాగి, సోదరి రమ్య, సతీమణి విశాలాక్షి కూడా రచయితలే. ఆయన స్వగ్రామం కర్నూలులో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విజయ ప్రసాద్ ఎల్ఐసి సంస్థలో విధులు నిర్వహించి 2012లో విరమణ పొందారు. వియోగి కలం పేరుతో ఆయన రాసిన పలు నవలలు, కథా సంపుటాలు, వందకు పైగా రేడియో నాటికలకు ఎన్నో బహుమతులు వచ్చాయి. కథా సంకలనాలు, హాస్య కథా సంకలనాలకు ఆయన సంపాదకత్వం వహించారు. 1992లో ఆకాశవాణి జాతీయ అవార్డు, 2016లో రాధాకృష్ణన్ స్మారక అవార్డు, ఎన్‌టిఆర్ అవార్డు, 2016లోనే లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు, 2017లో కువైట్ తెలుగు కళా సమితి అవార్డు అందుకున్నారు. వివాహ వీణ, ధీరనారి, బతుకు మొదలైన నవలలు, విలువలు, రసగుళికలు, మా బొమ్మ కథలు మొదలైన కథా సంపుటాలు వెలువరించారు. ఆయన మృతికి సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, జిల్లా నాయకులు ఆవుల బసప్ప, అరసం నాయకులు జహీర్ అహమ్మద్, పుల్లా రామాంజనేయులు, ప్రమోద్, రచయితలు, కవులు తదితరులు సంతాపం ప్రకటించారు.

బెంగళూరుకు అదాని పరిశ్రమ ప్రమాద బాధితులు

- విచారణకు చర్యలు తీసుకుంటాం : ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లి సమీపంలో అదానికి చెందిన అంబుజా సిమెంటు పరిశ్రమలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో కార్మికుడు శివకేశవ మృతి చెందారు. గాయపడిన క్షతగాత్రులను అనంతపురం సవేరా ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందించారు. మృతుడి స్వగ్రామం కిష్టపాడులో అంత్యక్రియలు నిర్వహించారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు ధర్నా

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో తాడిపత్రి సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. అదే సమయంలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి కూడా అక్కడికి విచ్చేశారు. యాజమాన్య ప్రతినిధులతో ఆయన చర్చించారు. మృతుడి కుటుంబానికి రూ.30 లక్షలు ఆర్థిక సహాయం అందించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పరిహారంతో పాటు మృతుడి భార్యకు ఉద్యోగం, మూడు ఎకరాల పొలాన్ని ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు జగన్ డిమాండ్ చేశారు. అన్ని విధాలా అండగా ఉంటామని ప్రభాకర్‌రెడ్డి చెప్పడంతో ఆందోళన విరమించారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబుళు ప్రకటనలో పేర్కొన్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం : ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించినట్లు అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని, బాధితులకు ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



తాడిపత్రి ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

తక్షణమే తప్పుకో !

- అమిత్ షా రాజీనామాకు షర్మిల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగ రూపకర్త బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలని, మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలు అమిత్ షా అహంకారానికి నిదర్శనమని 'ఎక్స్' వేదికగా గురువారం పోస్టు చేశారు. భారత రాజ్యాంగానికి ఇది ఘోర అవమానమని వెల్లడించారు. దళిత, గిరిజన, బిసి, మైనార్టీ ప్రజల మనోభావాలు ఈ వ్యాఖ్యలతో తీవ్రంగా దెబ్బతీసినట్లేనని చెప్పారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని అమలు చేసేందుకు సంఘ్ పరివార్ కుట్రలో భాగమే ఈ వ్యాఖ్యలని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతను ప్రతిసారీ బిజెపి హేళన చేస్తోందని, రాజ్యాంగంపై, జాతీయ జెండాపై ఆ పార్టీకి గౌరవం లేదని మరోసారి నిరూపితమైందని తెలిపారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నిరసనలు చేపట్టామన్నారు.

ఫైబర్‌నెట్ కనెక్షన్లను 50 లక్షలకు పెంపు

- ఛైర్మన్ జివి రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫైబర్‌నెట్ కనెక్షన్లను రానున్న రెండేళ్లలో 50 లక్షలకు పెంచుతామని ఎపి ఫైబర్‌నెట్ సంస్థ ఛైర్మన్ జివి రెడ్డి తెలిపారు. గత ఐదేళ్లలో 5 లక్షలకు కనెక్షన్లు పడిపోయాయని అన్నారు. విజయవాడలోని ఎన్‌టిఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లోని ఫైబర్‌నెట్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు తక్కువ ధరకే ఇంటర్నెట్ కేబుల్ సర్వీసులను అందించాలని 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫైబర్‌నెట్‌ను ప్రారంభించారని వెల్లడించారు. 2019 నాటికి పది లక్షల కనెక్షన్లు ఉండగా, ఇప్పుడు ఐదు లక్షలే ఉన్నాయని చెప్పారు. పది రెట్లు పెరగాల్సిన కనెక్షన్లు సగానికి తగ్గి సంస్థ దివాళా అంచుకు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనెక్షన్లు ఎందుకు తగ్గాయో అర్థం కావడం లేదన్నారు. ఆదాయం వచ్చే సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టారని, రూ.1,262 కోట్లకు అప్పులు చేరాయని వెల్లడించారు. నియామక పత్రాలు లేకుండా సంస్థలో ఉద్యోగాలిచ్చారని, వారు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియకుండా ఉందన్నారు.

సంపాదకీయం


మను దురహంకారం!

కేంద్ర హోంమంత్రి అమిత్ షా సాక్షాత్తూ రాజ్యసభలో బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ పేరును ఉచ్ఛరిస్తూ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యల పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలోనే- ఆ రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఆయన తక్షణం క్షమాపణ చెప్పటంతో పాటు తన పదవి నుంచి వైదొలగాలని విపక్షాలు డిమాండు చేశాయి. పార్లమెంటు బయట పెద్దఎత్తున నిరసన తెలిపాయి. బుధవారం కూడా పార్లమెంటులోనూ, దేశవ్యాప్తంగానూ నిరసన కార్యక్రమాలు జరిగాయి. "అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అనటం ఫ్యాషనై పోయింది. అదేదో వందసార్లు భగవంతుడి పేరు ఉచ్ఛరించినా స్వర్గలోకంలో స్థానం దొరుకుతుంది." అంటూ అమిత్ షా విపక్షాలపై విరుచుకుపడుతూ, తన మనువాద ధోరణిని బయటపెట్టుకున్నారు. అంబేద్కర్ పేరు ఉచ్ఛరించటమే నేరమన్నట్టుగా అసహనం ప్రదర్శించి, బిజెపి అసలు బుద్ధిని చూపించుకున్నారు. ప్రతిపక్షాలు అభ్యంతరం చెప్పాకైనా ఆయన చేసిన తప్పుకు లెంపలేసుకొని సభను క్షమాపణ కోరాల్సింది. ఆ పని చేయకపోగా అన్ని సందర్భాల్లాగానే ఈసారి కూడా విపక్షాలపై విరుచుకుపడ్డమే విధానంగా హోంమంత్రి, ఆయన పరివార గణమూ వ్యవహరించటం సిగ్గుచేటు. తగుదునమ్మా అని ప్రధాని మోదీ తన అనుంగు అనుచరుడిని వెనకేసుకురావటం, ఎప్పటిలాగానే నెహ్రూని, కాంగ్రెస్‌ని రంగంలోకి లాక్కొచ్చి పాత పాటలే వల్లెవేయడం దబాయింపు ధోరణికి పరాకాష్ట.

అమిత్ షా అక్కసు వాక్కులు అప్పటికప్పుడు అనుకోకుండా, ఆవేశపరంగా వచ్చినవి కావు. సంఘ పరివారం అణువణువునా అంబేద్కర్ పట్ల జీర్ణించుకొని ఉన్న అసహనపు భావజాలానికి బహిర్గత వ్యక్తీకరణే అది. దేశానికి దశాదిశా నిర్ణయించుకొని, అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగం రూపొందించుకొన్న తరుణంలో నేటి బిజెపి మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. తాము అత్యంత ప్రామాణికంగా భావించే మనుస్మృతికి స్థానం లేకుండా పోయిందే అని స్వయంగా గోల్వాల్కర్ తమ ఆర్గనైజర్ పత్రికలో వ్యాసాలు రాసుకున్నారు. దేశానికి ఈ రాజ్యాంగం పనికి రాదని, మూడు రంగుల జెండా అరిష్టమని పేర్కొనటమే కాదు; కొంతమంది రాష్ట్ర ప్రేమి యువదళ్ కార్యకర్తలు 2021లో నాగ్‌పూర్ ఆర్‌ఆర్‌ఎస్ కార్యాలయం మీద బలవంతంగా మువ్వన్నెల జెండా ఎగురవేసేదాకా వాళ్లు జాతీయజెండాను గుర్తించలేదు. అవకాశం వచ్చిన ప్రతిసారి రాజ్యాంగంపై విరుచుకుపడడం చాలామంది కాషాయదళ నాయకులకు అలవాటే. గత లోక్‌సభ ఎన్నికల తరుణంలో 400 సీట్లు సాధిస్తే రాజ్యాంగం మార్చి తీరుతామంటూ కొంతమంది బిజెపి నాయకులు బాహాటంగా ప్రకటించిన సంగతి విదితమే! నోటితో నవ్వి నొసటతో వెక్కిరించిన తీరుగానే బిజెపి అంబేద్కర్ పట్ల వ్యవహరిస్తూ ఉంటుంది. ఆయన విగ్రహానికి భారీగా పూలదండలు వేసి, ఘనంగా కబుర్లు చెప్పటం; రాజ్యాంగం నిర్దేశించిన విలువలను, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేయడం ఆ పార్టీ కపట నీతి.

మనుస్మృతి అత్యంత దుర్మార్గమైనదని, ఈ దేశానికి ఏమాత్రం పనికిరాదని అంబేద్కరే స్వయంగా దానిని దగ్ధం చేశారు. అలాంటి కాలం చెల్లిన క్రూరమైన మనువాదాన్ని నెత్తిన పెట్టుకొని, సనాతనమే తమ అభిమతంగా ఊరేగే బిజెపి గణం ఇక అంబేద్కర్ మహాశయుడి మార్గాన్ని ఎక్కడ గౌరవిస్తుంది? లోన ఒకటి బోధిస్తూ, అభిమానిస్తూ, బయట రకరకాల రంగుల మార్చే నటనా విన్యాసాలు చేయడం; అధికార అవసరాలకు తగ్గట్టుగా అబద్ధాలకు తెగించటం సావార్కర్ కాలం నుంచీ సంఘ్ పరివారానికి అలవాటు. వర్ణవ్యవస్థ విషవలయం నుంచి దేశం బయటపడాలన్న ఆధునాతన ఆచరణ అంబేద్కర్‌దైతే, దేశాన్ని మళ్లీ వెయ్యి పడగల విషపు నాగు నీడలోకి లాక్కుపోవడమే బిజెపి సనాతన పన్నాగం. ఈ రెండింటి మధ్య ఆకాశానికి, అథ:పాతాళానికి ఉన్నంత అంతరం ఉంది. ఈ నేపథ్యంలోనే అమిత్ షా అసహనంలోంచి అహంకారపు వ్యాఖ్యలు బయటకొచ్చాయి. ఈ తరహా పెత్తందారీ పోకడలు భారత రాజ్యాంగపు స్ఫూర్తికి ప్రమాదకరం. కాబట్టి హోంమంత్రి అమిత్ షా బుకాయింపు పర్వాన్ని కట్టిపెట్టి, బేషరతుగా క్షమాపణలు చెప్పాలి. రాజ్యాంగబద్ధంగా ప్రాప్తించిన పదవి నుంచి తక్షణమే తప్పుకోవాలి.

మంచి మాట



డబ్బు పోతే ఫర్వాలేదు.
ఆరోగ్యం చెడితే ఇబ్బంది.
కానీ...నైతిక విలువలు కోల్పోతే
అన్నీ కోల్పోయినట్లే.

- అబ్రహం లింకన్

స్వర్ణాంధ్ర @ 2047 విజన్ - ప్రజలపై విసిరిన దోపిడీ వల

విశ్లేషణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 225 పేజీల స్వర్ణాంధ్ర ప్రదేశ్-2047 విజన్ పత్రాన్ని ఎంతో ఆర్భాటంగా విడుదల చేసింది. పేదరికం లేని సమాజం, ఉపాధి, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, రైతు-వ్యవసాయ సాంకేతికత, ప్రపంచంలో అత్యుత్తమ లాజిస్టిక్స్, వ్యయ నియంత్రణ-ఇంధన వనరులు, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛాంధ్ర, అన్ని రంగాల్లో విస్తృత సాంకేతికత (డీప్ టెక్) వంటి పది సూత్రాల ఆధారంగా 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధిస్తామని విజన్ పత్రంలో పేర్కొన్నది.

ఈ విజన్ ద్వారా 2047 నాటికి ఆంధ్ర రాష్ట్రం దేశంలోనే గాక ప్రపంచంలోనే ఆర్థికాభివృద్ధిలో అగ్రగామిగా మారుతుందని తెలిపింది. అలాగే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (ఎస్.జి.డి.పి) 2.4 ట్రిలియన్ డాలర్లకు, తలసరి ఆదాయం 42 వేల డాలర్లకు, ఎగుమతులు రాష్ట్ర జిడిపిలో 18 శాతానికి పెరుగుతాయంది. వీటి సాధనకు రాబోయే 25 ఏళ్లలో ఏడాదికి సగటున 15 శాతం వృద్ధి రేటు సాధన లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వృద్ధి రేటు సాధించాలంటే ఈ విజన్ కాలంలో 40 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు సమీకరించాలని అందుకు చేపట్టాల్సిన విధి విధానాలను కూడా పత్రంలో పేర్కొన్నారు. ఈ విజన్ లక్ష్యాల సాధనకు అనుబంధంగా జిల్లా స్థాయిలో విజన్ మేనేజ్‌మెంట్ యూనిట్స్ (విఎం యుఎస్)ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.



డా॥ బి. గంగారావు


ఈ తరహా విజన్ పత్రాలు తయారు చేయించి విడుదల చేయటం చంద్రబాబు నాయుడుకు కొత్తేమీ కాదు. ప్రపంచ బ్యాంకు కనుసన్నలలో అమెరికాకి చెందిన మెకెన్సే అనే కన్సల్టెన్సీ సంస్థ రూపొందించిన 357 పేజీల పత్రాన్ని 1999లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజన్ 2020 పేరుతో విడుదల చేశారు. నయా ఉదారవాద విధానాలు ప్రారంభమైన తరువాత ఆ విధానాలను ప్రపంచ బ్యాంకు డైరెక్షన్‌లో దేశంలో అమలుకు ప్రయత్నం చేసిన మొదటి రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రాన్ని పేర్కొనొచ్చు. నేడు విజన్ 2047లో పేర్కొన్నట్లే 2020 నాటికి సాధించాల్సిన లక్ష్యాలను విజన్ 2020 పత్రంలో కూడా పేర్కొని రాష్ట్రమంతా హడావుడి చేసి అమలుకు ప్రయత్నం చేశారు.

రాష్ట్ర విభజన తర్వాత 2014లో మళ్ళీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్-2029 పేర మరో విజన్ పత్రాన్ని విడుదల చేశారు. రెండంకెల వృద్ధితో 2022 నాటికి దేశంలో బాగా అభివృద్ధి చెందుతున్న ఉన్నతమైన మూడు రాష్ట్రాల్లో ఆంధ్ర రాష్ట్రం ఒకటిగా నిలుస్తుందని అలాగే 2029 నాటికి దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆవిర్భవిస్తుందని ఊదరగొట్టారు. ఏడు మిషన్లు, ఐదు గ్రిడ్లు, ఐదు ప్రచారాలు సన్ రైజ్ ఆంధ్రా అభివృద్ధికి మూల స్తంభాలుగా ఉంటాయని తెలిపింది. అయితే ఈ విజన్ పత్రాల అమలు తర్వాత జరిగిందేంటి? తెలుగుదేశం పార్టీని ఆ తరువాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఘోరంగా ఓడించారు.

ఇప్పుడు స్వర్ణాంధ్ర-2047 విజన్ పత్రం ద్వారా గతంలో అమలు జరిపిన నయా ఉదారవాద ప్రపంచ బ్యాంకు విజన్‌ల వ్యూహాలను, విధానాలను మరింత విస్తృతంగా, వేగంగా అన్ని రంగాల్లో అమలుకు పూనుకోవటమే స్వర్ణాంధ్ర విజన్ పత్రం లక్ష్యం. గత విజన్ పత్రాలకి ఇప్పటి విజన్ పత్రం మధ్య ముఖ్యమైన పరిణామమేమంటే నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను మరింత ముందుకు తీసుకు పోవటానికి వికసిత్ భారత్ పేర విజన్ పత్రాన్ని విడుదల చేయటం. ఈ విజన్ పూర్తిగా అంతర్జాతీయ ఫైనాన్స్ మార్గదర్శకత్వంలో రూపొందించబడింది. ఈ విజన్ విధానాల ద్వారా 2047 నాటికి ప్రపంచంలో అమెరికా, చైనా తరువాత అతి పెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా, అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని దేశ ప్రధాని నరేంద్ర మోడి చెబుతున్నారు. దీనికి అనుసంధానంగానే స్వర్ణాంధ్ర విజన్-2047ను చూడాలి. కేంద్రంలోని బిజెపి సర్కార్, రాష్ట్రంలో టిడిపి-జన సేన కూటమి ప్రభుత్వం కలిసి ఉమ్మడిగా నయా ఉదారవాద విధానాలను ఈ విజన్ ముసుగులో వేగంగా అమలుకు పూనుకోవటంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలుచేసే సంస్కరణలన్నింటిని, కొత్తగా చేపట్టబోయే విధానాలన్నింటిని రాష్ట్రంలో అమలుకు ప్రయత్నం చేయడమే.

ఈ విజన్ ద్వారా రాబోయే రెండున్నర దశాబ్దాల్లో రాష్ట్ర జిడిపి 13 రెట్లు పెరిగి ప్రస్తుత 0.18 ట్రిలియన్ డాలర్ల (రూ.14.39 లక్షల కోట్లు) నుండి 2.4 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.200 లక్షల కోట్లు)కు చేరుతుందని, దేశ జిడిపిలో 8 శాతం వాటాకి భాగస్వామ్యం వహిస్తుందని ప్రకటించారు. తలసరి ఆదాయం కూడా 12 రెట్లు పెరిగి ప్రస్తుత 1700 (రూ.2.42 లక్షలు) డాలర్ల నుండి 42 వేల డాలర్ల (35.25 లక్షలు)కు చేరుతుందనీ, ఎగుమతులు కూడా 22 రెట్లు పెరిగి ఆంధ్ర రాష్ట్రం సౌభాగ్యవంతమైన రాష్ట్రంగా దేశంలోనేగాక ప్రపంచంలో నిలుస్తుందని నమ్మిస్తున్నారు.

"పారిశ్రామిక రంగంలో రంగుల కల చూపించారు. చాలా అద్భుతాలు జరగబోతున్నట్లు, పెట్టుబడులు వరదలా రూ.11.97 లక్షల కోట్లు రాబోతున్నట్లు చూపించారు. గత పదేళ్ళలో అనేక పెట్టుబడుల సదస్సులు నిర్వహించినా పెద్దగా ఫలితం లేదు. ఈ ఆర్థిక సంక్షోభ కాలంలో వస్తాయని గ్యారంటీ లేదు. మన రాష్ట్రం వలె మిగిలిన రాష్ట్రాలు కూడా ప్రైవేట్ పెట్టుబడుల కోసం పోటీ పడుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ పేర జరగబోతున్నది ఏంటంటే పెద్దయెత్తున రైతుల భూములు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు, మౌలిక సదుపాయాలు, సర్వీసులు, సహజ వనరులు, అటవీ సంపద వంటివి పెద్దయెత్తున పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయబడుతుంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రక్షణ కరువై మూతపడతాయి. ప్రభుత్వ పెట్టుబడి పారిశ్రామిక, మౌలిక, సేవా తదితర రంగాల్లో పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ముందుకొస్తుంది."



విజన్ 2020 సమయంలో వ్యవసాయం దండగ అని మాట్లాడారు. ఇప్పుడు వ్యవసాయ రంగాన్ని ఎగుమతి ఆధారిత, ఆహార ప్రాసెసింగ్, పకృతి వ్యవసాయ, వాణిజ్య కేంద్రంగా రాష్ట్ర వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకు రావాలని ఈ విజన్ పత్రంలో పేర్కొన్నారు. దీనికి ఆధునిక సాంకేతికతను జోడించారు. రాబోయే ఐదేళ్లలో సగటున 11.05 శాతం చొప్పున వ్యవసాయ వృద్ధి రేటు సాధించాలని, దీనికి సుమారు 5.85 లక్షల కోట్లు పెట్టుబడి సమీకరించాలని తెలిపారు. మొత్తం వ్యవసాయ భూమిలో 47 శాతాన్ని పకృతి వ్యవసాయం కిందకి మార్చాలని, దీనిలో కనీసం 40 శాతం పెద్ద పెద్ద వ్యవసాయ క్షేత్రాలకు మార్పు జరిగేలా ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. చేపలు, రొయ్యలు, పౌల్ట్రీ, ఇతర వాణిజ్య పంటలే రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి ముఖ్యమని తెలిపింది. 252 వ్యవసాయ ఆధారిత, ఎగుమతి, ఆహార ప్రాసెస్ పార్కులు ప్రైవేట్ రంగంలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ రంగ దుస్థితి, రైతుల పరిస్థితి, పంటలకు ప్రభుత్వ మద్దతు, ప్రభుత్వ మార్కెటింగ్, పెట్టుబడి కల్పన వంటివి ఎక్కడా ఈ పత్రంలో కనిపించవు. వ్యవసాయ కార్మికుల గురించి ప్రస్తావనే లేదు. కీలకమైన నీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిధుల కేటాయింపు వంటి వాటికి ఈ విజన్‌లో స్థానంలేదు. కేవలం నదుల అనుసంధానం, పోలవరం ప్రాజెక్టుల ప్రస్తావనకే పరిమితమైంది.

మొత్తంగా చూస్తే కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వ్యవసాయ సంస్కరణకు బ్లూ ప్రింట్‌లా వ్యవసాయ రంగంలో చేపట్టబోయే మార్పులు ఉన్నాయి. రాష్ట్ర వ్యవసాయ రంగం నేడు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లేకపోగా వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి తీసుకెళ్ళేలా ఉంది. ముఖ్యంగా వ్యవసాయ భూములు పెద్దయెత్తున వివిధ పేర్లతో ధనవంతులకు కట్టబెట్టేలా, భూ కేంద్రీకరణకు దారితీసే చర్యలకు సిద్ధమయ్యారు. కార్పొరేట్ వ్యవసాయానికి రాచబాట వేశారు. ఆహార భద్రతకు ముప్పు కలుగుతుంది. ఈ నమూనాలో ప్రాథమిక ఆహార పంటలను, వాటి ధరలను దెబ్బతీస్తారు. చిన్న సన్నకారు రైతుల భూములు కోల్పోవాల్సి ఉంటుంది. ఈ మార్పులు వ్యవసాయ ఉపాధిని దారుణంగా దెబ్బ తీసి పట్టణాలకు వలసలను తీవ్రతరం చేస్తాయి.

ఇక పారిశ్రామిక రంగంలో రంగుల కల చూపించారు. చాలా అద్భుతాలు జరగబోతున్నట్లు, పెట్టుబడులు వరదలా రూ.11.97 లక్షల కోట్లు రాబోతున్నట్లు చూపించారు. విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరుపారిశ్రామిక కారిడార్ల పొడవునా అంతర్జాతీయ స్థాయిలో ఫార్మా, రసాయనాలు వంటి 9 ప్రాధాన్యతా భారీ పారిశ్రామిక కేంద్రాలు నెలకొల్పటం, 25 పారిశ్రామిక క్లస్టర్లు, 500 పారిశ్రామిక ఎస్టేట్లు ఏర్పాటు చేస్తామంటున్నారు. అలాగే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విస్మరించి ప్రైవేట్ స్టీల్ ప్లాంట్లను నెలకొల్పుతామంటున్నారు. వీటన్నింటికి 2 లక్షల ఎకరాల భూమి సిద్ధం చేయడంతో పాటు భూ బదలాయింపు, విద్యుత్ రాయితీలు, మంచి నీరు, రోడ్లు, రైల్, పోర్టు కనెక్టివిటీ సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుందనీ పత్రం పేర్కొంటున్నది. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణకు, వాటిల్లో పని చేయటానికి ప్రపంచ స్థాయి నైపుణ్యం కలిగిన యువతను కూడా తయారు చేస్తామని పేర్కొన్నారు.

వాస్తవ పరిస్థితి ఏమిటి? రాష్ట్ర విభజన తరువాత రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక రంగం వాటా క్షీణించింది. వస్తు తయారీ రంగం ఎదుగు బొదుగు లేకుండా పడుంది. ఇప్పటికే కేటాయించిన భూముల్లో, ఎస్ఇజెడ్ లలో, క్లస్టర్లలో పరిశ్రమలు రాక ఖాళీగా ఉన్నాయి. కొన్ని చోట్ల మూతబడటం, వాటిని వేరే అవసరాలకు ఉపయోగించుకోవలసిన పరిస్థితి. మరోవైపు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను కేంద్ర బిజెపి ఒక్కొక్కటి అమ్మకానికి పెడుతున్నది. గత పదేళ్ళలో అనేక పెట్టుబడుల సదస్సులు నిర్వహించినా పెద్దగా ఫలితం లేదు. ఈ ఆర్థిక సంక్షోభ కాలంలో వస్తాయని గ్యారంటీ లేదు. మన రాష్ట్రం వలె మిగిలిన రాష్ట్రాలు కూడా ప్రైవేట్ పెట్టుబడుల కోసం పోటీ పడుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ పేర జరగబోతున్నది ఏంటంటే పెద్దయెత్తున రైతుల భూములు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు, మౌలిక సదుపాయాలు, సర్వీసులు, సహజ వనరులు, అటవీ సంపద వంటివి పెద్దయెత్తున పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయబడుతుంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రక్షణ కరువై మూతపడతాయి. ప్రభుత్వ పెట్టుబడి పారిశ్రామిక, మౌలిక, సేవా తదితర రంగాల్లో పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ముందుకొస్తుంది.

పెట్టుబడుల అవసరాల కోసం అందరికీ విద్య, ఉపాధి కల్పన పేర ప్రస్తుత విద్యా విధానాన్ని, బోధనా పద్ధతులను, పాఠ్యాంశాలను పూర్తిగా మార్చివేసి నైపుణ్యం కేంద్రంగా విద్యా విధానాన్ని మార్చాలని, 6వ తరగతి నుండే నైపుణ్య కోర్సులను తీసుకొస్తున్నట్లు విజన్ పత్రం తెలియజేస్తున్నది. విద్యను పూర్తిగా వ్యాపార సరుకుగా, పెట్టుబడి దారుల అవసరాలకు అనుగుణంగా కేంద్ర బిజెపి తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలుకు పూనుకుంటున్నది. బ్రిటీష్ వలస కాలంలో జరిగిన విధంగా పూర్తిగా పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య పెట్టుబడిదారుల అవసరాల కోసం, వారి లాభాల కోసం ఉపయోగపడే యువతను తయారు చేయటమే ఈ విద్యా విధానం లక్ష్యం. ఈ విజన్ అందరికీ ఉపాధి కల్పిస్తుందనేది ఒక భ్రమ మాత్రమే. విజన్ పత్రం చెప్పే 20 లక్షల ఉద్యోగ కల్పన అంతా అతి తక్కువ వేతనాలతో, హక్కులు, భద్రత లేకుండా పెద్దయెత్తున దోపిడీకి గురయ్యేవే. రెండో వైపు ఆర్థిక సంక్షోభం పెరిగేకొద్దీ పెద్ద యెత్తున నిరుద్యోగం పెరుగుతుంది. ఇప్పటికే ఈ విధానాల వల్ల నిరుద్యోగ సైన్యం పెరిగిపోతున్న విషయం తెలిసిందే.

పేదరిక నిర్మూలనకు చాలా విచిత్రమైన పరిష్కారాలను ముందుకు తీసుకొచ్చారు. సమాజంపై భాగంలో బాగా సంపద ఉన్న 10 శాతం సంపన్నులు అట్టడుగున పేదరికంలో మగ్గుతున్న 20 శాతం పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయటానికి ప్రత్యేక సహాయం చేస్తారని తద్వారా పేదరికం తగ్గుతందని తెలుపుతున్నది. అలాగే ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టబోయే వివిధ ఆర్థిక కార్యకలాపాల ద్వారా జిడిపి, తలసరి ఆదాయం పెరిగి ఆటోమేటిక్‌గా పేదరికం తొలగిపోతుందని తెలియజేశారు. 2047కి పేదరికాన్ని పూర్తిగా రూపుమాపుతామంటున్నారు. ఇవన్నీ ప్రజలను మోసగించటానికే. గత మూడు దశాబ్దాల నుండి ఇవే విధానాలు దేశంలో అమలు చేస్తున్నారు. పేదరికంపై ఇవే మాటలు ఊదరగొడుతున్నారు. పేదరికం తగ్గలేదు సరికదా ప్రపంచ ఆకలి సూచిక ప్రకారం 125 దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉంది. నేడు రాష్ట్రంలో 1.48 కోట్ల మంది ఇంకా ప్రభుత్వ రేషన్ బియ్యం మీదే ఆధారపడి వున్నారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. కనుక ఈ విజన్ వల్ల రాష్ట్రంలో పేదరికం మరింత విస్తరిస్తుందే తప్ప ఏమీ తగ్గదు. **(సశేషం)**

వ్యాసకర్త సెల్ : **9490098792** /

డోనాల్డ్ ట్రంప్ బెదిరింపు!

వ్యాఖ్య



అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ మరోసారి మన దేశాన్ని బెదిరించాడు. తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే ఏ దేశమైనా వాటి మీద పన్నులు విధిస్తే తాము కూడా దెబ్బకు దెబ్బ తీస్తామని అలాంటి దేశాలలో భారత్ కూడా ఉందని ట్రంప్ విలేకర్ల సమావేశంలో చెప్పాడు. తొలిసారి అధికారానికి వచ్చినపుడు చైనాపై వాణిజ్య పోరును ప్రారంభించటమే కాదు. మన దేశం నుంచి చేసుకొనే దిగుమతులపై ప్రాధాన్యత వ్యవస్థ విధానం (జిఎస్‌పి)లో భాగంగా ఇస్తున్న రాయితీలను కూడా రద్దు చేసిన పెద్దమనిషి ట్రంప్. మన దేశాన్ని తమ వలలోకి లాక్కొనేందుకు అంతకు ముందు అమెరికా విసిరిన బిస్కెట్ వంటిది ఆ రాయితీ. ట్రంప్ చర్యకు ప్రతిగా మనం కూడా అమెరికా ఉత్పత్తులపై పన్ను విధింపుకు పూనుకున్నాం. వాటి మీద ప్రపంచ వాణిజ్య సంస్థలో పరస్పరం మూడేసి కేసులు దాఖలు చేశారు. వాటిని పరిష్కరించుకోవాలని కొద్ది నెలల క్రితం ఇరు దేశాలు ఒక అవగాహనకు వచ్చాయి. ఆ స్ఫూర్తిని దెబ్బ తీసేందుకు ట్రంప్ పూనుకున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం అమెరికా నుంచి మనం చేసుకొనే దిగుమతుల కంటే మన ఎగుమతులే ఎక్కువగా ఉండి వాణిజ్య మిగులులో ఉన్నాం. దాన్ని పూడ్చేందుకు తమ వస్తువులను కొనుగోలు చేయాలని లేకుంటే వాణిజ్య పోరుకు దిగుతానని హెచ్చరించటమే ట్రంప్ మాటల అంతరార్థం.


పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటమనే పదం ఎంతో ముఖ్యం. వారు ఒక సైకిలు పంపితే మేము మరో సైకిలు పంపుతాం. వారు గనుక వంద లేదా రెండువందల శాతం పన్ను విధిస్తే మేమూ అదే చేస్తాం. చైనా, బ్రెజిల్, భారత్ వంటి దేశాలు అలా చేస్తున్నాయన్నాడు. వారు మార్చుకుంటే మంచిది. లేకుంటే మేమూ అదే చేస్తాం అన్నాడు. ప్రపంచ వాణిజ్య సంస్థ సమాచారం ప్రకారం 2023లో రక్షణ చర్యల్లో భాగంగా తృణధాన్యాలపై 193శాతం, పాల ఉత్పత్తుల మీద 188, ఖనిజాలు, లోహాలపై 187, నూనెగింజలు, ఖాద్యతైలాలపై 164, పానీయాలు, పొగాకుపై 150, పండ్లు, కూరగాయలపపై 132, రసాయనాలపై 56, కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలపై 53, చేపలు, వాటి ఉత్పత్తులపై 35 శాతాల చొప్పున అమెరికా దిగుమతి పన్ను విధిస్తున్నది. దాని నిర్వాకం ఇలా ఉంటే ఇతర దేశాలపై ఎదురు దాడికి దిగుతున్నది. జో బైడెన్‌తో మన దేశం కుదుర్చుకున్న అవగాహన ప్రకారం ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై పన్ను తగ్గి ఎగుమతి అవకాశాలు మెరుగుపడతాయని ఆ రంగాల వారు ఆశిస్తుండగా ట్రంప్ చేసిన తాజా ప్రకటనతో పరిస్థితి తిరిగి మొదటికి వస్తుందా అన్న అనుమానం కలుగుతున్నది. అయితే మీ ఇల్లు మా ఇంటికి ఎంత దూరమో మాదీ అంతే అన్న లోకోక్తి తెలిసిందే. అమెరికా లేకపోతే పూట గడవదు అనే పరిస్థితి ఎవరికీ లేదు. అమెరికాతో సహా అన్ని దేశాలూ ఏదో ఒకదాని కోసం ఇతరుల మీద ఆధారపడాల్సినవే. జపాన్ సంస్థ నోమురా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు వెల్లడించిన నివేదికలో ట్రంప్ గెలిస్తే రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య విబేధాలను పక్కన పెడతాడని, చైనాపై ఆంక్షలను పెంచుతాడని, దాని స్థానంలో భారత్‌ను ముందుకు తెస్తాడని, అది ఎంతో ఉపయోగమని చెప్పింది.

ఇక ట్రంప్ గతానికి వస్తే మన దేశం గురించి అన్న మాటలు ఇన్నిన్ని కాదు. అయినప్పటికీ అబ్‌కి బార్ ట్రంప్ సర్కార్ అంటూ ప్రధాని నరేంద్రమోడీ అమెరికా వెళ్లి మరీ అక్కడ ప్రచారం చేసి వచ్చారు. అయితే గత ఎన్నికల్లో ట్రంప్ మట్టికరిచాడు. మోడీ పరువు గంగలో కలిసింది. దిగుమతి పన్నులను భారత్ దుర్వినియోగ పరుస్తున్నదన్నాడు ట్రంప్. ప్రపంచంలో ఎక్కువ మొత్తాలను విధిస్తున్న దిగుమతి పన్నుల చక్రవర్తి వంటి పదాలతో అవమానించాడు. అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌ను పక్కన పెట్టాలన్న బ్రిక్స్ దేశాలు వెనక్కు తగ్గి అలాంటిదేమీ లేదని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకుంటే ప్రతికూల చర్యలు తప్పవని బెదిరించాడు. ఇటీవలి సంవత్సరాలలో మనదేశ విదేశీ వాణిజ్య భాగస్వాములలో చైనా, అమెరికా ఒకటి రెండు స్థానాలలో ఉంటున్నాయి. ట్రంప్ ఎన్ని మాటలు మాట్లాడినా అమెరికా అధ్యక్షుడు భారత్‌కు మిత్రుడని, రెండు దేశాల సంబంధాలు మరింతగా విస్తరిస్తాయని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వంటి వారు పొగుడుతూనే ఉన్నారు. హెచ్1బి వీసాల గురించి అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. గడచిన పది సంవత్సరాలలో చూస్తే అవి తగ్గాయి తప్ప పెరగలేదు. అమెరికా విధాన జాతీయ సంస్థ (ఎన్.ఎఫ్.ఏ.పి) సమాచారం ప్రకారం 2014-15లో ఉన్న వీసాల సంఖ్యతో పోలిస్తే ఎనిమిదేళ్ల కాలంలో 75 శాతం తగ్గాయి. అమెరికాలోని మనదేశ కంపెనీల రిక్రూట్‌మెంట్లు కూడా తగ్గాయి. అమెరికాకు అగ్రస్థానమే తన లక్ష్యం అని చెబుతున్న ట్రంప్ అధ్యక్షుడుగా కొలువు తీరాక నిజంగా ఏం చేస్తాడో చూడాల్సి ఉంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ఇవిఎంలు సమస్య కాదు

అసలు సమస్యలు పట్టించుకోవాలి



కత్తిరింపులు

హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా పరాజయం పాలైన తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇ.వి.ఎం) గురించి కాంగ్రెస్ తన ఆందోళనా స్వరాన్ని పెంచింది. ఎన్నికల సమగ్రతకు సంబంధించి చాలా అంశాలున్నాయి. వాటి పట్ల భారత ఎన్నికల సంఘం స్వచ్ఛంగా వుండాల్సిన అవసరముంది. ఇ.వి.ఎం లను ఎలక్ట్రానిక్ ట్యాంపరింగ్ చేసే ముప్పు ఈ జాబితాలోకి రాదు. కాంగ్రెస్ ఓ తప్పుడు అంశంపై గొంతెత్తుతోంది. అది కూడా ఎంపిక చేసుకున్న అంశాలపైనే, అందులోనూ ఓడిపోయిన వాటిపైనే మాట్లాడుతోంది. ఇ.వి.ఎం లకు సంబంధించి అవకతవకల ముప్పు వుందని సూచించేలా పరోక్షంగా లేదా ముందుగానే ప్రోగ్రామింగ్ చేయడం ద్వారా ట్యాంపరింగ్ జరిగి వుంటుందన డానికి ఎలాంటి ఆధారాలు లేవని కాంగ్రెస్ నేతలే కొందరు బహిరంగంగా అభిప్రాయపడ్డారు. ఇద్దరు ప్రతిపక్ష నేతలు నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ కూడా ఈ ఆరోపణలతో తమకు సంబంధం లేదని విడగొట్టుకున్నారు. ఇ.వి.ఎం లలో చాలా కచ్చితంగా, తెలివిగా అవకతవకలకు పాల్పడ్డారని భావించేందుకు వీల్లేదు. ఎందుకంటే, కొన్ని రాష్ట్రాల్లో బిజెపి విజయం సాధించింది, మరికొన్ని రాష్ట్రాల్లో ఓడిపోయింది. కాబట్టి ఇక్కడ ఆ లాజిక్ పని చేయడం లేదు. ఇదంతా కాకపోయినా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజారిటీని సాధించలేకపోయింది. పైగా, ఈ ఫలితాలన్నీ మరీ ముఖ్యంగా హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలు సామాజిక, రాజకీయ సమీకరణలు ఎలా పనిచేసినవో సరిగానే వివరించాయి.

ఇ.వి.ఎం లలో అవకతవకల గురించి పదే పదే లేవనెత్తడం ద్వారా ఎన్నికల సమగ్రతకు సంబంధించిన నిజమైన, తీవ్రమైన అంశాలు వెనక్కి పోతున్నాయి. ప్రతిపక్షాల పోలింగ్ ఏజెంట్లు లేని పోలింగ్ బూత్‌లలో, ఒక పార్టీ ఆధిపత్యమే వున్న చోట ఇ.వి.ఎం లను ఎత్తుకుపోవడానికి గల అవకాశాలనేవి వాటిలో ఒకటి. పోలింగ్ ముగిసే సమయంలో చాలా చోట్ల పెద్ద ఎత్తున ఓటింగ్ శాతం నమోదు కావడంపై ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో ఇది సందర్భోచితమైన అంశంగా వుంది. ఈ ధోరణిని ఎన్నికల కమిషన్ సంతృప్తికరమైన రీతిలో వివరించడం లేదు. దీనికి తోడు పెద్ద ఎత్తున ఓటర్ల పేర్ల నమోదు కావడం, తొలగించడమనేది కూడా ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోన్న ధోరణిగా వుంది. ఎన్నికల కమిషన్ దీన్ని పెద్దగా పట్టించుకోనట్లు కనిపిస్తోంది. ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్న ఢిల్లీలో, ముస్లిం ఓటర్ల పేర్లను ఎంపిక చేసి మరీ తొలగించినట్లు ఆరోపణలున్నాయి. యు.పి ఉప ఎన్నికల్లో, బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని ఊహించిన ఓటర్లను నిలువరించేందుకు పోలీసులు పక్షపాతంతో వ్యవహరించడం వివాదాస్పదమైంది. ఇక ఎన్నికల షెడ్యూలు అనేది మరో తీవ్రమైన అంశం. ఎన్నికల కమిషన్ దీనిపై పారదర్శకంగా వ్యవహరించడం లేదు. దేశంలో, రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలను నిర్వహించేందుకు సమాయత్తమవుతున్న దేశం ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను రెండు విడతలుగా నిర్వహించింది. దీనివల్ల లబ్ధి పొందింది బిజెపి మాత్రమే. ఈ అంశాల్లో కొన్ని స్థానికమైనవి, మరికొన్ని బిజెపి, ప్రతిపక్షం మధ్య గల సామర్థ్య అంతరం భారీగా వుండడానికి సంబంధించినవి. మరికొన్ని ఎన్నికల కమిషన్ కోర్టులో వున్నవి. ఎన్నికల సమగ్రతకు సంబంధించిన వాస్తవిక అంశాలపై ప్రతిపక్షం దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం వుంది. అంతేకానీ ఇ.వి.ఎం లపై భయాలు ఈ వాస్తవిక అంశాలను మరుగుపరిచేవిగా వుండకూడదు.

/ డిసెంబర్ 19 'హిందూ' సంపాదకీయం /

అమరావతిలో నీటి అవసరాలకు రూ.1585.95 కోట్లు

- జనవరి నెలాఖరులోగా టెండర్ల ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి పరిధిలో ప్రపంచబ్యాంకు నిధులతో చేపడుతున్న పనుల్లో భాగంగా తొలిదశలో నీటి నిల్వ, కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వీటి నిర్మాణానికి రూ.1585.95 కోట్లతో టెండర్లు పిలిచేందుకు సిద్ధమయ్యారు. అలాగే కాలువల వెంట గ్రీన్ బఫర్ జోన్‌కు మరో రూ.180 కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. జనవరి నెలాఖరులోపుఈ టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించారు.తొలిదశలో వీలైనంత త్వరగా వీటిని పూర్తి చేసే రాజధానికి కొత్త రూపం వస్తుందని, దీనికి సమాంతరంగా ఎల్‌పిఎస్ జోన్లనూ అభివృద్ధి చేయాలని అధికారులు భావిస్తున్నారు. రాజధాని పరిధిలో పాలవాగును 16.70 కిలోమీటర్ల దూరం, 23.60 కిలోమీటర్ల దూరం కొండవీటివాగు, 0.03 టిఎంసిలతో శాఖమూరు రిజర్వాయర్ అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీనికోసం రూ.590 కోట్లతో టెండర్లు పిలవనున్నట్లు తెలిసింది. వీటికి సంబంధించి నీటి ప్రవాహానికి గ్రావిటీ కెనాల్‌ను 7.83 కిలోమీటర్ల నిర్మించడంతోపాటు కొండవీటివాగుమీద కృష్ణాయపాలెంలో 0.10 టిఎంసిలతో నీటిని నిల్వ చేసుకునేందుకు కొత్తగా రిజర్వాయర్ నిర్మించనున్నారు. దీనికోసం రూ.386 కోట్లు ఖర్చు చేయనున్నారు. అలాగే నీరుకొండ రిజర్వాయర్‌ను 0.40 టిఎంసిలతో నిర్మించేందుకు రూ.608 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. వీటిన్నిటికీ ప్రభుత్వం నుండి అనుమతి కూడా వచ్చినట్లు తెలిసింది. ప్రపంచబ్యాంకు నిధులతో చేపడుతున్న పనులు కావడంతో ముందుగానే వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం కన్సల్టెన్సీకి, బ్యాంకు ప్రతినిధులకు సమర్పించాల్సి ఉంటుంది. దీనికోసం ముందుగానే అన్ని పనులకు సంబంధించిన నివేదికలు తయారు చేస్తున్నారు.

గ్రీన్ బఫర్ కీలకం

నీటి ముంపు లేకుండా, అలాగే నిల్వ సామర్థ్యం పెంచుకునే విధంగా రెండు పద్ధతుల్లో నిర్మించనున్న రిజర్వాయర్లు కాలవలను గ్రీన్ బఫర్ జోన్లుగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో అమోదించిన మాస్టర్‌ప్లానులోనూ వీటిని ప్రస్తావించారు. దీనిలో భాగంగా కొండవీటివాగు, పాలవాగులతోపాటు, రిజర్వాయర్లు ఏర్పాటు చేసే ప్రాంతాలను సుందరీకరించడంతోపాటు గ్రీన్ బఫర్‌జోన్‌గా ఏర్పాటుకు సిఆర్‌డిఏ అధికారులు ప్రతిపాదించారు. దీనికోసం సుమారు రూ.180 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిసింది. సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వ కాంప్లెక్స్‌లకు ఉత్తర దక్షిణ ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండే విధంగా కాలువలను నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించామని సిఆర్‌డిఏ అధికారులు తెలిపారు.



దీక్షా శిబిరంలో కూర్చున్న పోరాట కమిటీ నాయకులు

ఐక్యంగా పోరాడి స్టీల్‌ప్లాంటును రక్షించుకుందాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

ఐక్యంగా పోరాడి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 1407వ రోజుకు చేరాయి. ఢిల్లీ వెళ్లి ఉక్కు శాఖ మంత్రికి వినతిపత్రం అందజేసి వచ్చిన పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, ఎం.రాజశేఖర్, డి.ఆదినారాయణ తదితరులు గురువారం దీక్ష శిబిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని, జాయింట్ సెక్రెటరీ సంజయ్ రాయ్‌ను కలిశామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి గనులు కేటాయించాలని, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తూ కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం యాజమాన్యం ద్వారా అమలు చేస్తున్న ఆంక్షలు నిలిపివేయాలని కోరినట్లు తెలిపారు. నిర్వాసితులకు ఉపాధిని మెరుగుపరచాలని, కేంద్ర ప్రభుత్వం మూడేళ్లపాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాటు విద్యుత్, వాటర్ బిల్లులు వాయిదా వేయాలని కోరినట్లు చెప్పారు. స్టీల్‌ప్లాంట్ భూములను ఆర్‌ఐఎన్‌ఎల్ పేరున ట్రాన్స్‌ఫర్ చేయాలని, భద్రత ప్రమాణాలు మెరుగుపరచాలని, రైల్వే రాక్‌లను సకాలంలో అందించాలని కోరినట్లు తెలిపారు. గత నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో నష్టాల దిశగా నడుస్తున్న విశాఖ ఉక్కును పూర్వవైభవం దిశగా నడిచేందుకు కేంద్ర ఆర్థిక శాఖపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పోరాట కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, రామస్వామి, కెఎస్‌ఎన్.రావు, కామేశ్వరరావు, డేవిడ్, కారు రమణ, మసేన్‌రావు, రామకృష్ణ, సుబ్బయ్య, దేవుడు పాల్గొన్నారు.

ఢిల్లీలో చెట్ల గణనకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : దేశరాజధానిలో చెట్ల గణనకు సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. ట్రీ అథారిటీ, ఫారెస్టు రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఈ గణన నిర్వహించాలని తెలిపింది. ఒక ట్రీ ఆఫీసర్ 50కు పైగా చెట్ల నరికివేతకు అనుమతి ఇవ్వడంపైనా, సుప్రీంకోర్టు అనుమతి లేకుండా చెట్ల నరికివేతకు ఢిల్లీ ప్రభుత్వం అనుమతించకుండా నిరోధించాలని దాఖలైన పిటీషన్ విచారణలో జస్టిస్ ఎఎస్ ఒకా, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. చెట్లను సంరక్షించడం ట్రీ ఆఫీసర్ ప్రాథమిక కర్తవ్యమని, యాంత్రికంగా జారీ చేసిన ఆదేశాలతో చెట్ల నరికివేతకు అనుమతించకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ట్రీ ఆఫీసర్ తీసుకునే నిర్ణయాన్ని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సిఇసి) తప్పనిసరిగా పరిశీలించాలని కూడా ఆదేశించింది. ఈ సందర్భంగా ఢిల్లీ చెట్ల సంరక్షణ చట్టం 1994 ప్రకారం ట్రీ ఆఫీసర్లపై పర్యవేక్షణా అధికారాల అవసరాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. రాజధానిలో చెట్ల నరికివేతకు ముందస్తు అనుమతి అవసరమా.. లేదా అనే విషయాన్ని పరిశీలిస్తామని కూడా పేర్కొంది. ధర్మాసనానికి అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి సమాధానం ఇస్తూ చెట్ల గణనకు ఫారెస్ట్ సర్వే ఇండియా, ఫారెస్ట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

ముగ్గురిని పాఠశాలలో చేర్చుకోండి

- టిఫిన్ బాక్స్‌లో మాంసాహారం తెచ్చారని తొలగించిన విద్యార్థులకు అలహాబాద్ హైకోర్టు ఊరట

ప్రయాగ్‌రాజ్ : టిఫిన్ బాక్స్‌లో మాంసాహారం తీసుకొచ్చినందుకు పాఠశాల నుంచి బహిష్కరణకు గురైన ముగ్గురు బాలురకు అలహాబాద్ హైకోర్టు ఊరట కలిగించింది. ఈ విద్యార్థులు రెండు వారాల్లోగా వేరే పాఠశాలలో చేర్చేలా చూడాలని అమ్రోహా జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది. జిల్లాలోని ఒక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు తమ టిఫిన్ బాక్స్‌లో మాంసాహారం తెచ్చుకోవడంతో ప్రిన్సిపాల్ అభ్యంతరం వ్యక్తం చేసి, విద్యార్థులను బహిష్కరించారు. దీంతో బాధిత విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సిద్ధార్థ, .జస్టిస్ ఎస్‌సి శర్మ తో కూడిన ధర్మాసనం విచారించింది. రెండు వారాల్లోగా విద్యార్థులను మరొక సిబిఎస్‌ఇ అనుబంధ పాఠశాలలో చేర్చాలని జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 6కి వాయిదా వేసింది.

మణిపూర్, మరో రెండు ఈశాన్య రాష్ట్రాలకు 'సురక్షిత ప్రాంత అనుమతి'

న్యూఢిల్లీ : దాదాపు రెండేళ్ల నుంచి హింసాకాండతో రగులుతున్న మణిపూర్‌తో సహా మరో రెండు ఈశాన్య రాష్ట్రాలకు విదేశీయులకు 'సురక్షిత ప్రాంత అనుమతి' చట్టాన్ని కేంద్రం మళ్లీ తీసుకొచ్చింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం రాత్రి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'పునరుద్ధరణతో మణిపూర్‌ను సందర్శించే విదేశీయుల కదలికలను అధికారులు నిశితంగా పరిశీలిస్తారు. విదేశీయులు ఈ ఉత్తర్వులకు అనుగుణంగా అవసరమైన అనుమతిని పొందాల్సివుంటుంది' అని ప్రకటనలో తెలిపింది. మణిపూర్, నాగాలాండ్, మిజోరంలో ఈ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపింది. దీని ప్రకారం ఈ రాష్ట్రాల్లో పర్యటించే విదేశీయులు ముందస్తు అనుమతిని తీసుకోవాల్సి ఉంటుంది. ఈ చట్టం ప్రకారం విదేశీయులకు పది రోజులు మాత్రమే అనుమతి మాత్రమే ఇస్తారు. ఈశాన్య రాష్ట్రాల్లో సమీప దేశాల నుంచి చొరబాట్లు ఎక్కువవుతున్నాయనే వార్తలతోనే ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. సేనాపతి జిల్లాలో జరిగే ఒక సాంస్కృతిక కార్యక్రమానికి హాజరయ్యేందుకు కంగ్‌పోక్సి జిల్లా నుంచి రోడ్డు మార్గం ద్వారా వెళ్లవద్దని మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్‌ను ఒక సంస్థ హెచ్చరించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు కేంద్రం ఈ ప్రకటనలో తెలిపింది.

యుపిలో తెరుచుకున్న మరో ఆలయం

• బిజెపి మత విభజన, ఓటు రాజకీయాలు మానాలి : ప్రతిపక్షాల ఆగ్రహం



లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో మరో దేవాలయం తాళాలు తెరుచుకున్నాయి. హింసాకాండ చెలరేగిన షాహీ జామా మసీదుకు రెండు కిలోమీటర్ల దూరంలోని సరాయ్ తరీన్‌లో ఈ ఆలయం ఉంది. మసీదులో సర్వే నిర్వహించాలంటూ కోర్టు ఆదేశించిన నేపథ్యంలో సంభాల్‌లో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. పట్టణంలో ఉన్న ఖగ్గూ సరాయ్‌లోని దేవాలయాన్ని అధికారులు ఇదివరకే తెరవగా, తాజాగా తెరిచింది రెండోది. ఈ రెండు దేవాలయాలు ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతంలోనే ఉండడం గమనార్హం. సరాయ్ తరీన్‌లో 32 సంవత్సరాల నాటి దేవాలయం ఉందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, అధికారులు దాని తాళాలు తెరిచారు. దేవాలయం లోపల కృష్ణుడు, రాధ, హనుమంతుడి విగ్రహాలు ఉన్నాయి. ఆలయంలో తిరిగి పూజా కార్యక్రమాలు ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. అక్కడ ఆక్రమణలు జరిగిన దాఖలాలు కన్పించలేదని వారు చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా ఆ ప్రాంతంలో భద్రతా దళాలను మోహరించారు. బుధవారం సుమారు యాభై మంది అక్కడికి వచ్చి ప్రార్థనలు జరిపేందుకు సిద్ధమయ్యారు. యోగి సర్కార్ చర్యలు ఓటు రాజకీయాలతోపాటు మత విభజన ముడిపడి ఉన్నదని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

సిఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన చికిత్స

• మంత్రి వాసంశెట్టి సుభాష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్)తో పేద ప్రజల ప్రాణాలను కాపాడగలుగుతున్నామని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. తలసేమియాతో బాధపడుతున్న పాటి యామినికి మంజూరైన రూ.10 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కును, లబ్ధిదారు తండ్రి శ్రీనివాసరావుకు సచివాలయంలోని తన కార్యాలయంలో గురువారం అందజేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సిఎంఆర్‌ఎఫ్ నిధులతో మెరుగైన చికిత్సకు అవసరమైన ఆర్థికసాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

వర్రా కేసు వాయిదా

23 విచారణకు ఆదేశం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డి కేసు విచారణ 23కు వాయిదా పడింది. అన్నమయ్య జిల్లా రాజంపేట మన్యం రూరల్ పోలీసులు దాఖలు చేసిన పిటి వారెంట్ నేపథ్యంలో కడప జిల్లా నాల్గవ అదనపు న్యాయస్థానం ఎదుట గురువారం హాజరు పరిచారు. ఈ నెల 23కు విచారణను వాయిదా వేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - టి.నరసాపురం

అప్పులు తీర్చలేమోనన్న భయంతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరభద్రవరం గ్రామానికి చెందిన మామిళ్ల సూర్యచంద్రరావు (38) తన రెండెకరాల సొంత పొలంతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశారు. పెట్టుబడి కోసం అప్పులు చేశారు. పంటకు తెగులు సోకడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. పంట దిగుబడి తగ్గితే అప్పులు తీర్చలేమోననే భయంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం పురుగుల మందు తాగారు. కుటుంబసభ్యులు గమనించి జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సూర్యచంద్రరావుకు సుమారు రూ.15 లక్షలు అప్పు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కోల్‌కతా హైకోర్టుకు 'అభయ' తల్లిదండ్రులు

కోల్‌కతా : అభయ కేసులో తాజా దర్యాప్తు కోరుతూ బాధితురాలి తల్లిదండ్రులు గురువారం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. కొనసాగుతున్న దర్యాప్తుపై విశ్వాసం లేదని, తాజా దర్యాప్తునకు దిశానిర్దేశం చేయాలంటూ కోర్టును కోరారు. ఈ కేసును విచారిస్తున్న సిబిఐని పిటిషన్‌లో పార్టీగా చేర్చి, సోమవారం కోర్టు ముందు ఈ విషయాన్ని మరోసారి ప్రస్తావించాలని జస్టిస్ తీర్థాంకర్ న్యాయవాదిని ఆదేశించారు. ఈ ఏడాది ఆగస్టులో కోల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆస్పత్రి ట్రైనీ డాక్టర్ అత్యాచారానికి, హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా జూనియర్ వైద్యులు ఆందోళన చేపట్టారు. ఈ కేసులో ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ అభిజిత్ మండల్‌కు ఈ నెల 13న సీల్దాహ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 90 రోజుల చట్టబద్ధమైన వ్యవధిలో సిబిఐ వారిపై చార్జ్‌షీట్లు దాఖలు చేయడంలో విఫలమైందని వారి తరపు న్యాయవాదులు వాదించడంతో.. కోర్టు వారికి బెయిల్ మంజూరు చేసింది.



వినతులు స్వీకరిస్తున్న చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా

ఎస్‌సి ఉప కులాల సమగ్ర వివరాలను అందించాలి

• ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎస్‌సి ఉప కులాల వారీగా సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై కచ్చితమైన గణాంకాలతో సమగ్ర వివరాలను అందించాలని ఎస్‌సి ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ హాల్లో ఉమ్మడి జిల్లా అధికారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. షెడ్యూల్ కులాల వర్గీకరణపై ప్రజలు, ఉద్యోగులు, వివిధ కుల సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు. కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి 2011 జనాభా గణన ఆధారంగా ఎస్‌సి ప్రజల గణాంకాలను చైర్మన్‌కు వివరించారు. అనంతరం కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు 2011 జనాభా ఆధారంగా పూర్వ 13 జిల్లాల స్థాయిలో ఎస్‌సిల్లో 59 ఉపకులాల పరిస్థితులపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లో ఎస్‌సిల ప్రజాప్రతినిధుల వివరాలను ఉపకులాల వారీగా అందించాలని జడ్‌పి సిఇఒ, డిపిఒలను ఆదేశించారు.

కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. వినతులు ఇచ్చేందుకు భారీ సంఖ్యలో వచ్చిన ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు కలెక్టరేట్ లోపలికి అనుమతించారు. అదే సమయంలో తమ నాయకులు ముగ్గురినే లోపలికి అనుమతించడంపై మాల మహానాడు నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని వారిని అదుపు చేశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన ఎంఆర్‌పిఎస్ నాయకులు చైర్మన్‌ను కలిసేందుకు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. కాకినాడ డిఎస్‌పి, జెసి వారికి నచ్చజెప్పి 15 మందికి అనుమతి ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది.

పేదలకు అండగా ఉంటాం..

• కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి



నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రంలోని మహిళలతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- కుప్పం టౌన్ (చిత్తూరు జిల్లా)

పేదలకు అండగా ఉంటామని, ఉపాధి కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్‌టిఆర్ ట్రస్ట్ అధినేత నారా భువనేశ్వరీ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో గురువారం ఆమె పర్యటించారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఎపిఎస్ ఆర్‌టిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులతో కలిసి పిఇఎస్ వైద్యకళా శాల ప్రాంగణంలో ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలో చంద్రబాబు స్వగృహ నిర్మాణాన్ని పరిశీలిం చి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అక్కడి నుండి కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకుని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతులలో ఉందని, యువత సన్మార్గాన్ని అవలంభిస్తూ, సాంకేతి కతను అందిపుచ్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతు లకు వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. పట్టణంలో ఎన్‌టిఆర్ ట్రస్ట్ తరపున నిర్వహిస్తున్న డిఎస్‌సి శిక్షణ కేంద్రాన్ని పర్యవేక్షిం చారు. అన్ని అర్హతలు ఉండి డిఎస్‌సి శిక్షణ పొందలేని పేద విద్యార్థుల సౌకర్యార్థం ఎన్‌టిఆర్ ట్రస్ట్ తరపున డిఎస్‌సి శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

అమిత్ షాను తొలగించాల్సిందే

• కెవిపిఎస్, ప్రజా సంఘాల డిమాండ్



విజయవాడ శిఖామణి సెంటర్ వద్ద కెవిపిఎస్, ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేసి, మంత్రి పదవి నుంచి తొలగించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా విజయవాడలోని శిఖామణి సెంటర్‌లో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. పార్లమెంట్ సభ్యుడిగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై ప్రమాణం చేసిన అమిత్ షా, తిరిగి అంబేద్కర్‌పైనే కుల, మత అహంకారంతో వ్యాఖ్యలు చేయడం సిగ్గుమాలిన చర్యగా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు ప్రధాని మోడీ బాధ్యత వహించి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం ఎన్నికల్లో పోటీ చేయకుండా అమిత్ షా కనీసం పంచాయతీ బోర్డు సభ్యుడు కాలేడన్నారు. ప్రభుత్వ పెద్దలు అనుభవిస్తున్న పదవులన్నీ అంబేద్కర్ ప్రసాదించినవేనని గుర్తుంచుకోవాలని సూచించారు. గురువు కోసం తన పేరును సైతం అంబేద్కర్ త్యాగం చేశారన్నారు. అంబేద్కర్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతి కుమార్, విసికె పార్టీ నాయకులు గంజి రామారావు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎం బుజ్జి, సిహెచ్ చంద్రలీల, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జి నటరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోట కళ్యాణ్, సోమేశ్వరరావు, మురహరి, శ్యామ్, విజయ్ తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హౌతి రెబెల్స్‌కి చెందిన ఓడరేవులు, ఇంధన సదుపాయాలపై ఇజ్రాయిల్ దాడులు

జెరూసలేం : యెమెన్‌లో హౌతి రెబెల్స్ ఉపయోగించే ఓడరేవులు, ఇంధన సదుపాయాలపై ఇజ్రాయిల్ దాడులు చేసింది. రెబెల్స్ నుండి వచ్చిన క్షిపణిని అడ్డుకున్న అనంతరం మీ దగ్గరకు కూడా వస్తామంటూ హౌతి నేతలకు హెచ్చరిక జారీ చేసింది. రాజధాని సానాలోని విద్యుత్ స్టేషన్లు, చమురు కేంద్రాలు, ఓడరేవుపై ఇజ్రాయిల్ దాడులు జరిపిందని, మరణాలు సంభవించాయని, గాయ పడ్డారని హౌతి మీడియా తెలిపింది. అంతకుమించి వివరాలు వెల్లడించలేదు. తొలుత హౌతి రెబెల్స్ ఇజ్రాయిల్‌పై క్షిపణిని ప్రయోగించడంతో వాటిని అడ్డుకున్న ఇజ్రాయిల్ వెంటనే దాడులు చేపట్టింది. గాజాలో మిలటరీ ఆపరేషన్‌ను నిరసిస్తూ రెబెల్స్ ఇజ్రాయిల్‌పై దాడులు చేపట్టారు. హౌతికి చెందిన మీడియా చానెల్ అల్ మసిరా మాట్లాడుతూ, సానాలో వరుస దాడులు చోటు చేసుకున్నాయని చెప్పారు. ఓడరేవును లక్ష్యంగా చేసుకుని శత్రువు నాలుగుసార్లు దాడి చేశారని, చమురు కేంద్రంపై రెడు సార్లు దాడి చేశారని తెలిపారు. గాజాపై దాడిని నిలిపేంతవరకు ఈ దాడులు తప్పవని హౌతి రెబెల్స్ ఇజ్రాయిల్‌కు స్పష్టం చేశారు.

అదేమీ కొత్త కాదు

అమిత్ వ్యాఖ్యలపై అంబేద్కర్ మనుమడు ప్రకాశ్

పూనే : భారత రాజ్యాంగ నిర్మాతపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్ తప్పుపట్టారు. ఆ వ్యాఖ్యలు బిజెపి 'పాత మనస్తత్వాన్నే' ప్రతిబింబించిందని ఎద్దేవా చేశారు. వంచిత్ బహుజన్ అఘాడీ (విబిఎ) అధినేత అయిన ప్రకాష్ పూనేలో విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన సేవల విషయంలో బిజెపి తృణీకార భావనను అమిత్ షా వ్యాఖ్యలు బయటపెడుతున్నాయని విమర్శించారు. 'బిజెపి ఉనికిలోకి రాకముందు దానికి ముందున్న జన్‌సంఘ్, ఆర్‌ఎస్‌ఎస్‌లు రాజ్యాంగాన్ని ఆమోదించే సమయంలో బాబాసాహెబ్‌ను వ్యతిరేకించాయి. అమిత్ ప్రకటనలో కొత్తేమీ లేదు. వారు తమ పాత ప్రణాళికలను అమలు చేయలేకపోతున్నారు. కాంగ్రెస్ కారణంగా కాదు... బాబాసాహెబ్ అంబేద్కర్ కారణంగా వారు నష్టపోతారు' అని చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్లు వేగవంతం చేయండి

• రాష్ట్రాలను కోరిన కేంద్రం


న్యూఢిల్లీ : గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు కుళాయి నీటి కనెక్షన్లను వేగవంతం చేయాలని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ విషయాన్ని జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ గురువారం వెల్లడించారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ భారతదేశంలో కుళాయి నీటి కనెక్షన్ల పథకం గడువు 2024తో ముగిసిందని అంగీకరించారు. ఇప్పటికీ నాలుగు కోట్ల కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లు లేవని, వందశాతం లక్ష్యాలు సాధించేందుకు ఆయా రాష్ట్రాలతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. అధికారిక సమాచారం ప్రకారం ఇప్పటి వరకూ 79 శాతం గ్రామీణ కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లు అందించారని, మరో 19 కోట్ల కుటుంబాలను ఈ పథకం కోసం గుర్తించారని మంత్రి తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో అతి తక్కువగా 53.9 శాతం గృహాలకే కనెక్షన్లు కేటాయించారని మంత్రి చెప్పారు.

అమెరికా ఆంక్షలను నిరసించిన పాకిస్తాన్

• పాక్ అణు కార్యక్రమమే లక్ష్యంగా అమెరికా చర్యలు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమంపై విధించిన ఆంక్షలను ఆ దేశం తీవ్రంగా నిరసించింది. పక్షపాత వైఖరితో అమెరికా విధించిన ఈ ఆంక్షలతో ప్రాంతీయ శాంతి ప్రమాదంలో పడుతుందని హెచ్చరించింది. పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ఈ ఆంక్షలు తమ ప్రాంత వ్యూహాత్మక సుస్థిరతకు తీవ్రమైన పర్యవసానాలు కలిగిస్తాయని హెచ్చరించింది. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా కేవలం అనుమానాలతోనే గతంలో కూడా ఆంక్షలు విధించారని పాక్ విమర్శించింది. అమెరికా ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తోందని వ్యాఖ్యానించింది.

అంతకుముందు పాక్ అణు కార్యక్రమానికి దోహదపడుతున్నాయం టూ నాలుగు కీలక సంస్థలపై అమెరికా బుధవారం ఆంక్షలు విధించింది. ఇస్లామాబాద్ కేంద్రంగా ప్రభుత్వ రంగంలో పనిచేసే నేషనల్ డెవలప్‌మెట్ కాంప్లెక్స్ (ఎన్‌డిసి) కూడా ఈ ఆంక్షలు విధించిన సంస్థల్లో ఒకటిగా వుంది. షహీన్ బాలిస్టిక్ క్షిపణులతోపాటు దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని అభివృద్ధిపరచడానికి అవసరమైన పరికరాలు సరఫరా చేసే చైనా కంపెనీలు కూడా ఈ ఆంక్షలు విధించిన వాటిలో వున్నాయి.



ఉచితంగా కేన్సర్ వ్యాక్సిన్

- ప్రకటించిన రష్యా

మాస్కో : కేన్సర్ వ్యాక్సిన్‌ను రష్యా అభివృద్ధిపరిచింది. కేన్సర్ రోగులకు దీన్ని ఉచితంగానే పంపిణీ చేస్తారని రష్యా వార్తా సంస్థ టాస్ తెలిపింది. పలు పరిశోధనా కేంద్రాల సహకారంతో ఈ ఎంఆర్‌ఎన్‌ఎ లేదా మెసెంజర్ ఆర్‌ఎన్‌ఎ వ్యాక్సిన్‌ను వృద్ధి చేశారు. 2025 తొలినాళ్లల్లో ఇది ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నారు. ఈ వ్యాక్సిన్‌పై ప్రి క్లినికల్ ట్రయల్స్ నిర్వహించగా కణితి పెరగకుండా అణచివేయడంలో ఈ వ్యాక్సిన్ బాగా పనిచేస్తోందని తేలిందని రష్యా ఆరోగ్య శాఖకు చెందిన రేడియాలజీ మెడికల్ రీసెర్చ్ సెంటర్ జనరల్ డైరెక్టర్ ఆండ్రీ కాప్రిన్ తెలిపారు. ప్రొటీన్ తయారుచేయాలని మన కణాలకు ఈ వ్యాక్సిన్ మెసేజ్‌ను ఇస్తుందని, దాంతో తయారయ్యే ప్రొటీన్ తన శరీరంలో అమితమైన స్పందనకు కారణమవుతుందని పేర్కొన్నారు.

రెండు దశాబ్దాలుగా యత్నించినా ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చలేక పోయాం

- అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ వ్యాఖ్య

న్యూయార్క్ : తన ఆధిపత్యాన్ని అంగీకరించని దేశాలను దుష్ట రాజ్యాలుగా జాబితాలో చేర్చి, అక్కడి ప్రభుత్వాలను కూల్చడమే పనిగా పెట్టుకున్న అగ్ర రాజ్యానికి ఇరాన్ ఎలా కొరకరాని కొయ్యగా తయారైందో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ చెప్పారు. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని కూల్చేందుకు గత రెండు దశాబ్దాలుగా అనేక విధాలా యత్నించామని, అయినా, ఫలితం లేకపోయిందని బ్లింకెన్ బహిరంగంగా పేర్కొన్నారు. విదేశీ సంబంధాల మండలిలో బుధవారం మాట్లాడుతూ బ్లింకెన్ ఈ విషయం వెల్లడించారు. "గత 20 ఏళ్లుగా మేం చేసిన ప్రయత్నాలను వెనక్కి తిరిగి చూసుకుంటే అవేవీ కూడా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయని తెలుస్తోంది" అని చెప్పారు. 1979లో బందీల సంక్షోభం తర్వాత అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ ఇరాన్‌తో 1980 ఏప్రిల్ నుండి దౌత్య సంబంధాలను తెగతెంపులు చేసుకున్నారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు లేకపోవడమే ఈ వైఫల్యానికి కారణమని ఆయన చెప్పారు. ఇరాన్‌లో ప్రభుత్వానికి కట్టుబడి వుండే వారి సంఖ్య గణనీయంగా వుంటుందని, సాంప్రదాయసిద్ధమైన ఈ అంశం వారికి బాగా కలిసివచ్చిందని ఆయన అన్నారు.

వ్యవసాయ మార్కెట్లపై 'ఫ్రేమ్‌వర్క్‌'ను ఉపసంహరించుకోవాలి

- దేశవ్యాప్తంగా 23న పాలసీ కాపీలను దగ్ధం చేయండి : ఎఐకెఎస్ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వ్యవసాయ మార్కెటింగ్‌పై క్రూరమైన నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్‌ను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. క్రూరమైన వ్యవసాయ చట్టాలను తిరిగి తీసుకురావడానికి ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలకు ఎఐకెఎస్ ఆందోళనకు పిలుపునిచ్చింది. దేశంలోని అన్ని జిల్లాల్లో ఈ నెల 23న పాలసీ కాపీలను దహనం చేయాలని ఎస్‌కెఎం ఇచ్చిన పిలుపులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దుష్ట ఉద్దేశాలను వెల్లడించిందన్నారు. రైతుల ప్రయోజనాలను బలిపెట్టి కార్పొరేట్ల లాభాలను పెంచాలనే కుట్రలో భాగమని పేర్కొన్నారు. చిన్న ఉత్పత్తిదారులు ప్రతికూలంగా దెబ్బతింటారని, వ్యవసాయం నుంచి నెట్టబడతారని తెలిపారు. జాతీయ విధాన ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నయా ఉదారవాద, ఛాందసవాదులు మూడు క్రూరమైన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా చారిత్రాత్మక పోరాటంతో వెనక్కి తీసుకున్నారని, అయితే అందులోని అంశాలనే ఇప్పుడు జాతీయ విధాన ఫ్రేమ్‌వర్క్‌లో తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ ముసాయిదాలో ఎంఎస్‌పి చట్టబద్ధం గురించి, వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడి పెంపుదల, రైతు అనుకూల రుణ సదుపాయాలు మొదలైన రైతుల ఉద్యమం లేవనెత్తిన డిమాండ్లు లేవని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ అనేది రాష్ట్ర పరిధిలోని అంశమని, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాన్ని లాక్కోవడం, రాష్ట్ర మద్దతుతో ఉన్న మార్కెట్‌ను రద్దు చేయడం ముసాయిదాలో స్పష్టమైందన్నారు. మౌలిక సదుపాయాలు, ఎపిఎంసిల పాత్రను దెబ్బతీస్తుందని, ప్రైవేట్ ట్రేడింగ్ కార్టెల్‌ల దోపిడీకి చిన్న, మధ్య తరగతి రైతులు కుదేలయిపోతారని పేర్కొన్నారు.



పంజాబ్‌లోని అమృతసర్ సమీపంలో ఆందోళన చేస్తున్న రైతులు

దల్లేవాల్‌కు వైద్య పరీక్షలు ఎందుకు నిర్వహించలేదు?

- పంజాబ్ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ : సుమారు నెల రోజుల నుంచి నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్‌కు వైద్య పరీక్షలు నిర్వహించకపోవడంపై పంజాబ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కనీసం వారం రోజుల పాటు చికిత్స తీసుకునేలా ఒప్పించాలని పంజాబ్ ప్రభుత్వానికి సూచించింది. రైతుల ఆందోళనను భగ్నం చేయడానికి ఎవరూ ప్రయత్నించడం లేదు. మేం వారి నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్‌కు భద్రత కల్పించాలని మాత్రమే ప్రయత్నిస్తున్నాం. దల్లేవాల్ క్షేమంగా ఉన్న తరవాత ఆయనతో కోర్టు మాట్లాడుతుంది' అని సుప్రీంకోర్టు తెలిపింది. దల్లేవాల్ వైద్య సహాయం అందించాలని, ఆందోళన విరమించేలా ఒప్పించాలని పంజాబ్, కేంద్ర ప్రభుత్వాలను ఈ నెల 13న సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఎంఎస్‌పికి చట్టబద్ధత, రైతు రుణాల మాఫీ వంటి డిమాండ్లతో 70 ఏళ్ల దల్లేవాల్ నవంబర్ 26 నుంచి ఖనౌరీ ప్రాంతంలో నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే.

ఢిల్లీలో బాణసంచాపై శాశ్వత నిషేధం

న్యూఢిల్లీ : ఢిల్లీలో బాణసంచాపై శాశ్వత నిషేధం విధించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ (రక్షణ)చట్టం 1986 ప్రకారం ఢిల్లీలో శాశ్వత నిషేధం విధిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (పర్యావరణ) ఎకె సింగ్ పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫారమ్లతో సహా బాణా సంచా తయారీ, వినియోగం, నిల్వ, విక్రయంపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలో వాయుకాలుష్యం తీవ్రస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఇప్పటికే ఢిల్లీలో నిర్మాణ కార్యక్రమాలు, నగరంలో ట్రక్కుల ప్రవేశంపై నిషేధం వంటి చర్యలు అమలు చేస్తున్నారు.

వామపక్షాల ఎన్నికల ప్రణాళిక విడుదల

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే స్థానాల వెల్లడి

న్యూఢిల్లీ : నాలుగు వామపక్షాల ఢిల్లీ శాఖలు గురువారం సంయుక్తంగా వామపక్ష ప్రత్యామ్నాయ ప్రణాళికను విడుదల చేశాయి. దీంతో పాటూ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు స్థానాల్లో ఏ పార్టీ అభ్యర్థి ఎక్కడ పోటీ చేస్తారో ప్రకటించాయి. గురువారం ఇక్కడ జరిగిన పత్రికా సమావేశంలో ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కరవాల్ నగర్, బాదర్పూర్ స్థానాల్లో సిపిఎం, వికాస్ పురి, పాలెంలో సిపిఐ, నారెలా, కోంధి స్థానాల్లో సిపిఐ(ఎంఎల్) అభ్యర్థులు పోటీ చేస్తున్నారని ఆ ప్రకటన తెలియజేసింది. ఇవి కాకుండా, రాబోయే రోజుల్లో సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్‌లు మరికొన్ని సీట్లలో తమ అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నాయి. బిజెపిని ఓడించాలి, వామపక్షాలను గెలిపించాలనే నినాదంతో ఈ శాఖలు సంయుక్త ఎన్నికల ప్రణాళికను రూపొందించాయి.

కుల్గాంలో ఎన్‌కౌంటర్

- వెటరన్ కమాండర్‌తో సహా ఐదుగురు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కమాండర్ ఫరూక్ అహ్మద్‌భట్‌తో సహా ఐదుగురు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులు మృతి చెందారు. మరో ఇద్దరు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలోని ఖాదర్ ప్రాంతంలో తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే ఖచ్చితమైన సమాచారంతో అక్కడకు చేరుకున్న భద్రతా సిబ్బంది ముందుగా వారిని లొంగిపొమ్మని కోరారని, అయినా వారు కాల్పులు ప్రారంభించడంతో ఈ ఎన్‌కౌంటర్ ఘటన జరిగిందని చెప్పారు. ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డ సైనికులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. భట్‌తోపాటు ఉగ్రవాదులు ఇర్ఫాన్ లోన్, ఆదిల్ హుస్సేన్, ముస్తాక్ ఇటూ, యాసిర్ జావేద్ మరణించినట్లు చెప్పారు. వీరంతా కుల్గాం జిల్లాకు చెందినవారే. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఐదు ఎకె-47 రైఫిళ్లు, రెండు గ్రెనేడ్లు, 20 మ్యాగజైన్లు, మందుగుండు సామాగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దక్షిణ కాశ్మీర్‌లో ప్రముఖ హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్‌గా ఫరూక్ అహ్మద్ భట్ అలియాస్ నాలీకి పేరుంది. ఈ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించడంలో భట్ కీలక పాత్ర పోషించాడని చెబుతున్నారు. 2015 నుంచి ఫరూక్ చురుగ్గా ఉంటున్నాడని, యువకులను ఉగ్రవాదం వైపు మళ్లించడంతో కీలక పాత్ర పోషిస్తున్నాడని ఆర్మీ 2 సెక్టార్ రాష్ట్రీయ రైఫిల్స్ కమాండర్ బ్రిగేడియర్ అనిరుధ్ చౌహాన్ తెలిపారు. భట్‌పై 37 ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయని చెప్పారు.

ఈ ఏడాది 4శాతం వృద్ధి రేటు

- వార్షిక పత్రికా గోష్టిలో పుతిన్
- ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధమని వెల్లడి

మాస్కో : రష్యా ఈ ఏడాది దాదాపు 4శాతం మేర వృద్ధి రేటు సాధించినట్లు అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. వినిమయ ద్రవ్యోల్బణం అధికంగా 9.3శాతం వున్న మాట నిజమేనని అంటూ, దాన్ని కుదించడానికి సెంట్రల్ బ్యాంక్ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రతి ఏటా రష్యా అధ్యక్షుడు నిర్వహించే ఈ పత్రికా సమావేశం సుదీర్ఘంగా సాగుతుంది. దేశ రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై అధ్యక్షుడి నియంత్రణను తెలియచేసేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేయబడుతుంది. ఈసారి ప్రశ్నోత్తరాల సెషన్‌లా సాగిన ఈ సమావేశంలో అనేక అంశాలపై పుతిన్ మాట్లాడారు. దేశ విదేశీ జర్నలిస్టులు హాజరయ్యారు. మొదటిసారిగా కృత్రి మేథస్సును ఈ కార్యక్రమం కోసం వాడారు. రష్యాలోని 11 టైమ్ జోన్‌ల వ్యాప్తంగా ఈ పత్రికా సమావేశాన్ని ప్రభుత్వ టివి ప్రసారం చేస్తుంది. సాధారణంగా దేశీయ, స్థానిక అంశాలే ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఈసారి సామాన్య ప్రజలు ఇప్పటికే 20లక్షలకు పైగా ప్రశ్నలు అధ్యక్షుడికి పంపించారని రష్యన్ ప్రభుత్వ మీడియా తెలియచేసింది. కాగా ఈసారి ఉక్రెయిన్‌లో రష్యా మిలటరీ చర్య, పశ్చిమ దేశాలతో పెరుగుతున్న ఉద్రిక్తతలకు సంబంధించి ప్రశ్నలు ఎక్కువగా వస్తాయని భావిస్తున్నారు. రష్యా ప్రత్యేక మిలటరీ చర్యకు విజయవంతమైన ముగింపు వుంటుందని పుతిన్ ప్రతిన చేశారు. ఈ ఏడాది రష్యా కదన రంగ విజయాల గురించి ఆయన గొప్పగా చెప్పారు. ఉక్రెయిన్‌తో చర్చలకు తాము సిద్ధంగానే వున్నామని పుతిన్ ప్రకటించారు. అయితే నాటోలో ఉక్రెయిన్ చేరరాదని స్పష్టం చేశారు. సిరియాలో రష్యా ఓటమి చెందిందనడాన్ని పుతిన్ తిరస్కరించారు. మొదటిసారిగా సిరియాపై మాట్లాడిన పుతిన్, త్వరలో సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌ను కలుసుకోనున్నట్లు చెప్పారు. సిరియాలో అదృశ్యమైన అమెరికా జర్నలిస్టు ఆచూకీని కనిపెట్టడానికి సాయపడతానని పుతిన్ హామీ ఇచ్చారు.

10,128 గ్రామాల్లో రీసర్వే

(మొదటిపేజీ తరువాయి)

చేయించాలని కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు వచ్చే ఏడాది నుంచి వీటిని అందించాలని నిర్ణయించింది. పాఠశాల విద్యార్థులకు అందిస్తున్నట్లే వీరికి కూడా కిట్లను, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సచివాలయంలో విలేకరులకు వెల్లడించారు. గత ప్రభుత్వంలో సర్వే చేయగా పోనూ రాష్ట్రంలో ఇంకా 10,218 గ్రామాలు మిగిలి ఉన్నాయని, వాటిలో కూడా సర్వే పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు వైసిపి ప్రభుత్వం విడుదల చేసిన రెండేళ్ల కాలపరిమితి జివోను మరో రెండేళ్లు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కోసం సృష్టించుకున్న 679 సూపర్ న్యూమరీ డిప్యూటీ తహశీల్దార్(రీ-సర్వే) పోస్టులు మరో రెండేళ్లు ఉంటాయని పేర్కొన్నారు. జివోలో పేర్కొన్న షరతులతోనే మిగిలిన గ్రామాల్లో రీసర్వే చేస్తారని తెలిపారు. గ్రామ కంఠం భూముల సర్వే, రికార్డింగ్ కోసం గత ప్రభుత్వం 6,688 గ్రామాల్లో రీసర్వే చేయిస్తే దాదాపు 1.95లక్షల గ్రీవెన్సులు ప్రభుత్వానికి అందాయని వెల్లడించారు. సబ్ డివిజన్ చేసేందుకు 48,899 అర్జీలు వచ్చాయని,నిర్ధిష్ట సమయంలో వీటిని ఎలాంటి ఫీజు లేకుండా చేస్తామన్నారు. రాజధాని అమరావతికి రూ.16వేల కోట్ల రుణాలు తీసుకునేందుకు అనుమతి కావాలని సిఆర్‌డిఎ కమిషనర్ పంపిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందన్నారు. హడ్కో నుంచి రూ.11వేలకోట్లు, జర్మనీ ఫైనాన్స్ కంపెనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5వేల కోట్లు చొప్పున రుణం తీసుకుంటున్నట్లు తెలిపారు. విజయనగరం, ఏఎస్‌ఆర్, కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆగస్టు 30వ తేది తరువాత ముంపునకు గురైన ప్రాంతాల రైతులకు రుణాలు రీషెడ్యూల్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రూ.50వేల లోపు రుణాలపై స్టాంప్ డ్యూటీ, యూజర్ చార్జీలు మినహాయింపు ఉండేలా ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

వరి సేకరణ కోసం వెయ్యి కోట్లు

వరి సేకరణ కోసం మార్క్‌ఫెడ్‌కు అదనంగా రూ. వెయ్యికోట్ల రుణాన్ని జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి పొందేందుకు ప్రభుత్వ హామీని పొడిగించిన్నట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం తీసుకున్న వెంటనే సొమ్ము చెల్లించే అవకాశాలను పరిశీలించాలని సిఎం మంత్రులను ఆదేశించారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ప్యాకేజి 6ఎ ఎసెన్షియల్ బ్యాలెన్స్ పనుల కోసం పిలిచిన టెండర్ల ప్రతిపాదనకు ఎలాంటి జ్యుడీషియల్ ప్రివ్యూ లేకుండానే పూర్తిచేసేలా ఆమోదం తెలిపిందన్నారు. నెడ్‌క్యాప్, ఎన్‌టిపిసి జాయింట్ వెంచర్‌కు ఆమోదం చెప్పినట్లు తెలిపారు. జలజీవన్ టెండర్లను రద్దు చేసి మరలా కొత్తగా టెండర్లను పిలిచేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఇప్పటివరకూ రాష్ట్రంలో పనులు ప్రారంభించని 25శాతం కంటే తక్కువ పనులు రూ.11,400కోట్ల విలువైన 44,195 పనులు ఉన్నాయని వివరించారు. ఈ పథకం కింద కొన్ని రాష్ట్రాలు లక్షల కోట్లు తీసుకుంటున్నా గత రాష్ట్రప్రభుత్వం కేవలం రూ.26వేల కోట్లకే ప్రతిపాదనలు పంపిందని, వీటిల్లోనూ రూ.4వేల కోట్లే ఖర్చు చేసిందన్నారు. చిన్న రాష్ట్రమైన కేరళ రూ.70వేల కోట్ల వరకు తీసుకుందని తెలిపారు.

మరికొన్ని నిర్ణయాలు

.ఎపి రియల్ ఎస్టేట్ అపిలేట్ ట్రిబ్యునల్‌కు 14 పోస్టులు మంజూరు.

.చిత్తూరు జిల్లా తమ్మిగానిపల్లె గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం స్థాపనకు 50.21 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఉచితంగా బదిలీ.

. కర్నూలు జిల్లా బి తాండ్రపాడు గ్రామంలోని 5 ఎకరాల భూమిని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌కు ఎకరా రూ.61,23,516ల చొప్పున బదలాయింపునకు ఆమోదం.

.రాష్ట్రవిభజన చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి బదలాయించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మార్కెటింగ్ జివి రమేష్‌కుమార్‌ను ఎపిలో కొనసాగేలా సూపర్ న్యూమరరీ పోస్టు ఏర్పాటుకు ఆమోదం.

.హంద్రీనివా సుజల స్రవంతి ఫేజ్-2 కింద సిసిలైనింగ్ పనులకు సేవింగ్స్ నిధుల నుంచి రూ.480.22కోట్లు ఖర్చుకు నిర్ణయం.

.మంగళగిరిలోని ఎయిమ్స్‌కు కేటాయించిన 183.11 ఎకరాల భూమిని 177.07ఎకరాలకు తగ్గిస్తూ, సబ్‌డివిజన్ నెంబర్లను కలుపుకుని ఎరాటా జారీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

అమిత్‌షా తప్పుకో!

(మొదటిపేజీ తరువాయి)

రాశారు. తనను బిజెపి ఎంపిలు నెట్టారని కూడా ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఎంపిలపై రాహుల్ గాంధీ దాడి చేశారంటూ బిజెపి పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మల్లికార్జున ఖర్గేను పడగొట్టారని కాంగ్రెస్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అవమానకర వ్యాఖ్యలను నిరసిస్తూ లోక్‌సభలో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. మరోవైపు రాహుల్ గాంధీని కొట్టారని ఆరోపిస్తూ బిజెపి ఎంపిలు ఎదురుదాడికి దిగారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన సభలో ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో సభ నేటికి వాయిదా వేసింది. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఎంపికకు సంబంధించిన తీర్మానాన్ని సభా కార్యక్రమాల్లో చేర్చారు. కానీ దానిని పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తొలుత రెండు గంటల వరకు సభ రద్దయింది. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లోకి ప్రవేశించినప్పుడు తనకు చేదు అనుభవం ఎదురైందని బిజెపికి చెందిన ఫాంగ్నోన్ కొన్యాక్ ఆరోపించారు. ఈ విషయాన్ని స్పీకర్‌కు చూపుతూ ఫిర్యాదు చేసినట్లు కూడా కొన్యాక్ సభకు తెలియజేశారు. ప్రతిపక్షాల నిరసన సమయంలో, కాంగ్రెస్ నాయకుడు జెపి నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ చర్యను సభ ఖండించాలని కూడా నడ్డా డిమాండ్ చేశారు. కొన్యాక్ ఫిర్యాదును స్వీకరించామని, దానిని విచారిస్తున్నామని స్పీకర్ జగదీప్ ధన్‌ఖర్ తెలిపారు. అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం కొనసాగడంతో సభ శుక్రవారానికి వాయిదా పడింది. రాజ్యసభలో మాట్లాడేందుకు కేవలం బిజెపి నేతలకే అవకాశం ఇచ్చినట్లు ఆరోపణలు వస్తోన్న నేపథ్యంలో గురువారం కూడా అదే చోటు చేసుకుంది.

పార్లమెంట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు : రాహుల్ గాంధీ

బిజెపి ఎంపిలను నెట్టివేశానన్న ఆరోపణలు నిరాధారమని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. 'ఇది మీ కెమెరాలో ఉండవచ్చు. నేను పార్లమెంటు ప్రవేశద్వారం గుండా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, బిజెపి ఎంపిలు నన్ను అడ్డుకుని, నెట్టేందుకు, బెదిరించేందుకు ప్రయత్నించారు. కాబట్టి ఇది జరిగింది. మల్లికార్జున్ ఖర్గేను నెట్టేశారు. కానీ మేము కుట్రకు ప్రభావితం కాదు. ఇది ప్రవేశ ద్వారం. లోపలికి వెళ్లే హక్కు మాకు ఉంది. బిజెపి ఎంపిలు మమ్మల్ని లోపలికి వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కేంద్ర సమస్య ఏమిటంటే వారు రాజ్యాంగంపై దాడి చేయడం, అంబేద్కర్ స్మృతిని అవమానించడం' అని అన్నారు. అదాని ఘటన నుంచి దృష్టి మరల్చేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. మోడీ స్నేహితుడు అదానిపై అమెరికాలో ఆరోపణలు వచ్చాయని, మోడీ భారతదేశాన్ని అదానికి అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది ప్రధాన అంశమని, దీనిపై చర్చించేందుకు బిజెపి ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. బిజెపి ఎంపిలు పార్లమెంట్ గేటు వద్ద నిలబడి వచ్చిన వారిని అడ్డుకున్నారని, ఇదో కొత్త రకమైన నాటకమని రాహుల్ దుయ్యబట్టారు.

బిజెపి ఎంపిలు నెట్టేశారు.. కిందపడ్డాను : ఖర్గే

ప్రతిపక్ష ఎంపిలను బిజెపి సభ్యులు తోసేశారని రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు. తాను బ్యాలెన్స్ తప్పి పడిపోయానని, చివరకు నేలపై కూర్చోవాల్సి వచ్చిందని తెలిపారు. బిజెపి ఉలిక్కిపడిందని, అంబేద్కర్‌ను అవమానించారనే అంశంపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతాయని ఖర్గే అన్నారు. మల్లికార్జున్ ఖర్గే తనను బిజెపి ఎంపిలు నెట్టేశారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. బిజెపి ఎంపిలు తనను నెట్టడంపై విచారణకు ఆదేశించాలని, ఇది తనపైనే కాకుండా రాజ్యసభ ప్రతిపక్షనేతపై జరిగిన దాడి అని అన్నారు. 'మేము ఒక వరుసలో శాంతియుతంగా నిరసన చేస్తున్నాము. వాళ్ళు ఏమనుకున్నారో నాకు తెలియదు. మేము నడుచుకుంటూ వెళ్తున్నాం. వారు మకరద్వార్ వద్దకు వచ్చి మమ్మల్ని ఆపడానికి అక్కడ కూర్చున్నారు. మేము లోపలికి వెళ్లాలనుకున్నాం. కాని వారు మమ్మల్ని గేటు వద్ద ఆపారు. వారి కండబలం చూపించడానికి, వారికి చాలా మంది పురుష ఎంపిలు ఉన్నారు. మాతో మా మహిళా ఎంపిలు ఉన్నారు. వారిని కూడా ఆపారు. బలవంతంగా మాపై దాడి చేశారు. నేను ఎవరినీ నెట్టలేని స్థితిలో లేను. ఇప్పుడు మేము వారిని నెట్టామని వారు ఆరోపిస్తున్నారు' అని ఖర్గే అన్నారు.

అమిత్ షాను కాపాడేందుకే : ప్రియాంక గాంధీ

కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ 'రాహుల్ గాంధీ బిఆర్ అంబేద్కర్ ఫోటోను పట్టుకుని పార్లమెంటు లోపలికి శాంతియుతంగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆయనను పార్లమెంటులోకి రాకుండా ఎవరు అడ్డుకున్నారు? మనం రోజూ నిరసనలు చేస్తూనే ఉన్నాం. కానీ ఇంతకు ముందెన్నడూ ఇలాంటివి జరగలేదు. ఈరోజు (బిజెపి) తొలిసారిగా నిరసన చేపట్టినప్పుడు ఇదంతా జరిగింది. వాళ్ల రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గేను నెట్టడంతో ఆయనపై పడిపోయారు. ఆయన ఈ ఘటనలో గాయపడ్డాడు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను కాపాడేందుకు ఇదంతా చేస్తున్నారు' అని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష సభ్యులను పార్లమెంట్‌లోకి రాకుండా అడ్డుకునేందుకు అధికార పార్టీ ఎంపిలు 'గూండాగిరి'కు పాల్పడ్డారని విమర్శించారు.

అమిత్ షాకు వ్యతిరేకంగా ఖర్గే ప్రివిలేజ్ నోటీసు

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే ప్రివిలేజ్ నోటీస్ ఇచ్చారు. గురువారం ఖర్గే ప్రివిలేజ్ నోటీస్‌ను సమర్పించారు. బిఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను అవమానకరమైనవిగా, సభను ధిక్కరించేలా పరిగణిస్తూ ఆయనపై ప్రివిలేజ్ ప్రొసీడింగ్‌లు ప్రారంభించాలని నోటీసులో ఖర్గే అభ్యర్థించారు.



పార్లమెంటులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష నేతలు



మీకోసం

రాగి పాత్రలను ఉప్పు, చింతపండు వేసి తోమితే తళతళలాడుతాయి.

జీవన సారథ్యం

గతం గురించి బాధపడుతూ కూర్చోకూడదు. గతం నేర్పిన పాఠాలతో భవిష్యత్తుని నిర్మించుకోవాలి.

చీమలు నేర్పిన పాఠం



రెండవ తరగతి క్లాసు రూంలో చివరి పీరియడ్‌లో పిల్లలు ఆడుకుంటున్నారు. అప్పుడు సృజన ఉన్నట్లుండి గుక్కపట్టి ఏడుస్తోంది. ఆ పక్కనే నిహాల్ బిక్కముఖంతో నిలబడున్నాడు. టీచర్ గబుక్కున వాళ్ల దగ్గరకు వచ్చింది.

'సృజనా! ఎందుకు ఏడుస్తున్నావు?' అంది టీచర్. సృజన ఏడుస్తూనే నిహాల్ వైపుకి చూపించింది. టీచర్ అతని వైపుకి తిరిగి ఏం జరిగిందన్నట్లు చూశారు. నిహాల్ తరగతి గోడ చివర నేల వైపుకి వేలు పెట్టి చూపించాడు. అక్కడ నేల మీద నీళ్ళు కనిపించాయి. టీచర్‌కి ఏమీ అర్థం కాలేదు.

'ఏమైంది? ఇక్కడ నీళ్ళు ఎవరు పోశారు?' అంది టీచర్. 'నిహాల్ పోసాడు' ఏడుస్తూనే అంది సృజన. 'నీ వాటర్ బాటిల్‌లో నీళ్ళు ఒంపేసాడా?' అంది టీచర్. సృజన కాదన్నట్లు తల అడ్డంగా ఊపింది. 'మరెందుకు ఏడుస్తున్నావు?' అంది టీచర్. 'నిహాల్ బాటిల్‌లో నీళ్ళు పోసేసాడు' వెక్కుతూ అంది సృజన. 'మరి నువ్వెందుకు ఏడుస్తున్నావు?' అంది టీచర్.

'టీచర్! ఇక్కడ చూడండి. చీమలు ఏదో పట్టుకుని వరుసగా వెళ్తున్నాయి. అది నేను నిహాల్‌కి చూపించాను. నిహాల్ వాటర్ బాటిల్‌లో నీళ్ళు వాటి మీద పోసాడు. పాపం! చీమలన్నీ చెదిరిపోయాయి' అంటూ మళ్ళీ ఏడుస్తుంది సృజన.

'ఇదా నీ ఏడుపుకి కారణం?' ఒక్కసారిగా నవ్వేసింది టీచర్. సృజన ఆ నవ్వుకి ఏడుపు ఆపేసి టీచర్ వంక చూసింది. 'టీచర్! చీమలు ఒకదాని వెనుక మరొకటి ఏదో పట్టుకుని వెళ్తున్నాయి. అదేమిటో చూద్దామని నీళ్ళు పోసాను. అవి చెల్లాచెదిరిపోయాయి' అన్నాడు నిహాల్.


'చీమలు చాలా క్రమశిక్షణ కలిగిన శ్రమజీవులు. మీరు లంచ్ చేసినప్పుడు కింద పడిన ఆహారం అవి వాటి నివాసంలోకి చేరవేసుకుంటున్నాయి. వర్షాకాలంలో అవి బయటకు రావు. అందుకని వాటి ఆకారం చిన్నదైనా మోయలేనంత బరువు మోస్తూ ఆహారం నిలువ చేసుకుంటాయి. నువ్వు నీళ్ళు పోసి వాటి గమ్యాన్ని చెరిపేయడం తప్పు నిహాల్!' అంది టీచర్.

'సారీ టీచర్!' తలదించుకుని అన్నాడు నిహాల్. 'సరే ఇక వెళ్లి ఆడుకో' అని సృజన వైపుకి తిరిగింది టీచర్. 'సృజనా! చీమలలో మరో గొప్పతనం కూడా ఉంది. అవి అన్నీ కలిసికట్టుగా ఉంటాయి. సాధారణంగా ఒక్క చీమ ఒంటరిగా మనకెప్పుడూ కనిపించదు. మీరు చీమల నుండి నేర్చుకోవలసింది కష్టపడటం, ఐకమత్యంగా ఉండటం. నిహాల్ తప్పు తెలుసుకున్నాడు. ఇక తనను ఏమీ అనకూడదు' అంది టీచర్. సృజన కళ్ళు తుడుచుకుంటూ నిహాల్ వైపుకి స్నేహపూర్వకంగా చూసింది.

– కె.వి.సుమలత,
94926 56255.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న చుక్కల పక్కనే ఉన్న అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి.
ఇదిగో మెయిల్ ఐడీ:
chinnaarips@gmail.com

నేను గీసిన బొమ్మ





జొన్నాడ అభిషేక్,
6వ తరగతి,
ఎంపిపియుపి స్కూల్,
నడవపల్లి,
అంబేద్కర్ కోనసీమ జిల్లా

అసలే చలికాలం..ఇవి పాటిద్దాం...

శీతల గాలులతో చలి తీవ్రత పెరిగింది. గత నాలుగు రోజుల నుంచి ఉదయం, సాయంత్రం ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా చలి గజగజలాడిస్తోంది. తాకిడి తట్టుకోలేక కొన్ని చోట్ల ప్రజలు చలిమంటలు వేసుకుంటున్నారు. చలి దుస్తులు అమ్మే దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

వర్షాకాలంలోనే కాదు. శీతాకాలంలో కూడా వ్యాధులు చుట్టుముట్టేస్తుంటాయి. రోజురోజుకూ చలి తీవ్రత పెరిగిపోతుండటంతో పలు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. గత వారం రోజులుగా చలి తీవ్రత భారీగా పెరిగింది. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జలుబు, ఆయాసంతో కూడిన శ్వాస కోశ, చర్మ సంబంధిత వ్యాధులతో ఎక్కువ మంది బాధపడుతున్నారు. ఈ కాలంలో సూర్యుడు వచ్చే వరకూ బయటకు రావొద్దనీ, సూర్యాస్తమయానికి ముందే ఇంటికి చేరుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. చలి తీవ్రతకు ప్రతి మనిషి శరీరంలోని రక్తనాళాలు ముడుచుకుపోతాయి. రక్త ప్రసరణ సాఫీగా సాగదు. ఇది గుండె, మెదడుపై ప్రభావం చూపి ఆయాసం, గుండెనొప్పి, బ్రెయిన్ స్ట్రోక్, ఫిట్స్, ఆకస్మికంగా కుప్పకూలటం వంటివి తలెత్తే ప్రమాదం ఉంది. అధిక చలి ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు రావటానికి దారితీస్తుంది. మధుమేహంతోపాటు పొగతాగటం అలవాటు ఉన్న వారు ఈ కాలంలో సూర్యుడితోపాటు బయటకు రావాలని, లేకుంటే ప్రమాదమని చెబుతున్నారు.

గత వారంరోజులుగా చలిగాలులు బాగా వీస్తున్నాయి. అనూహ్యంగా చలి భయపెట్టేస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది చలి శీతాకాలం ప్రారంభం నుంచి ఉధృతంగానే కొనసాగుతోంది. బంగాళాఖాతం, అరేబియా మహాసముద్రాల్లో అల్పపీడనాలు పడటమే కారణం. ఏదేమైనా చలిని తట్టుకోవాలంటే ఈ కాలంలో కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిందే. ఉదయం 10 గంటలకు కూడా మంచుతెరలు పోవటం లేదు. సూర్యకాంతి తగటం లేదు. సాయంత్రం 5 గంటల తర్వాత ఆరుగంటల్లోపు నుంచి చలి గంటగంటకూ పెరుగుతోంది. చలికాలం ఈ సారి కాస్త ఇబ్బందికరంగా ఉండేలానే ఉంది. చలిలో వైరస్‌లు ఉధృతమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఫ్లూ జ్వరాలు, దగ్గు, జలుబు పెరిగిపోతున్నాయి. అందువల్ల ప్రతిఒక్కరూ చలికాలాన్ని ఆస్వాదిస్తూనే ఆరోగ్యపరమైన కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

తాజా కూరగాయలు మేలు

చలికాలంలో తినే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైనంతవరకూ అప్పుడే వండిన ఆహారాన్ని తీసుకోవాలి. వీలు కుదుర్చుకుని కార్బోహైడ్రేట్‌లు అధికంగా ఉన్న బియ్యం, చపాతీ, కేక్, పిస్తా వంటి వాటిని తగ్గించి వీటికి బదులుగా పండ్లు, ధాన్యాలు, కూరగాయలు, డ్రై ఫ్రూట్లు తీసుకోవాలి. దంపుడు బియ్యం, ఓట్స్, బ్రౌన్‌బ్రెడ్ వంటి వాటిని ఎంచుకోవచ్చు. క్యారెట్లు, ముల్లంగి, బంగాళాదుంప, ఉల్లి, అల్లం వంటి వేరు సంబంధిత కూరగాయలను తినొచ్చు. ప్రొటీన్ అధికంగా ఉండే గుడ్లు, చేపలు, మాంసం, పాల ఉత్పత్తుల వంటివి శీతాకాలంలో ఆరోగ్యానికి మంచివి. జింక్ ఎక్కువగా ఉండే మొక్కజొన్న, రాగి, క్వినోవా వంటి తృణధాన్యాలు, విటమిన్ సి అధికంగా ఉండే కివి, టమాటా, జామ, నిమ్మ, బొప్పాయి, నారింజ వంటి పదార్థాలను తినటం మంచిది. మనల్ని మనం రక్షించుకోవటానికి ఇంట్లో తయారుచేసిన కషాయాలు, హెర్బల్ టీలను తీసుకోవచ్చు. రోజూ 4, లేదా ఐదు తులసి ఆకులను తినొచ్చు. దగ్గు, జలుబు నుంచి రక్షణ కోసం అల్లం ఎక్కువగా వాడాలి. పసుపు యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కల్గివుంటుంది. మెంతి, వెల్లుల్లిలో కూడా ఆ లక్షణాలు ఉంటాయి.

వ్యాయామానికి మొదటి ప్రాధాన్యత

ప్రతిరోజూ వ్యాయామం చేయటాన్ని అలవాటు చేసుకోవాలి. కేవలం శరీర బరువును నియంత్రించటమే కాదు. మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపర్చటంలోనూ తోడ్పడుతుంది. రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపర్చటానికి తోడ్పడుతుంది. వీలైనంతవరకూ ఉదయాన్నే అరగంట పాటు తేలికైన వ్యాయామాలు చేసినా చాలు. వీలైనంత వరకూ ఉదయాన్నే చేయాలి. ఆ సమయంలో వాతావరణం చల్లగా ఉండటం వల్ల త్వరగా అలసిపోరు. దాంతో ఎక్కువ సమయం వర్కవుట్స్ చేయొచ్చు.




ఈ లక్షణాలు ఇబ్బందికరమే

- తీవ్రమైన చెమట, వికారం, మైకం
- నోట్లో నుంచి లాలాజలం కారడం
- తలనొప్పి, చెవిలో శబ్దాలు
- గుండె లయలో మార్పులు
- తాత్కాలిక గందరగోళం
- కండరాలు పట్టేయడం
- కాళ్లు చేతులు వాటికవే కదిలిపోవటం
- భయం, ఆందోళన, బిత్తర చూపులు చూడటం

ఈ జాగ్రత్తలు పాటించటం మేలు

- ప్రతిరోజూ ఉదయం సూర్యకిరణాలు శరీరంపై పడేలా చూసుకోండి
- శరీరానికి అవసరమైన విటమిన్ –డి అందుతుంది
- సరిపడా నీటిని తాగాలి
- శరీరం డీ–హైడ్రేషన్‌కి గురికాకుండా చూసుకోవాలి
- రోజూ 8 గంటలు నిద్ర పోవాలి.
- రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలి
- మెదడు చురుగ్గా పనిచేసేలా చూస్తే ఒత్తిడి తగ్గుతుంది
- మానసిక ప్రశాంతత ఉండేలా చూసుకోవాలి
- ఉష్ణోగ్రత తగ్గినప్పుడు వైరస్ ఎక్కువ కాలం జీవించొచ్చు
- ఉష్ణోగ్రత తగ్గినపుడు వైరస్ ఎక్కువకాలం జీవించి ఇతరులకు వ్యాపించొచ్చు.
- సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ తప్పనిసరిగా పెట్టుకోవాలి
- వైరస్‌ల భయం వెంటాడుతున్నందున ప్రయాణాల్లో మాస్కులు ధరించటం మేలు
- ఉదయం,రాత్రిళ్లు ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సివస్తే స్వెట్టరు ధరించాలి
- తలకు టోపీ లేదా మెుఫ్లర్ వంటివి సుఖవంతంగా ఉంటాయి
- పడుకునేటప్పుడు ఉన్నితో తయారుచేసిన దుప్పట్లు కప్పుకోవటం ఉత్తమం
- గ్రామీణ ప్రాంతాల్లోనైతే రగ్గులు వంటివి ఎంత చలినైనా తట్టుకుంటాయి
- పొగ మంచు కురిసే సమయంలోనైతే శరీరం తడవకుండా మందపాటి దుస్తులు ధరించాలి
- పొగమంచులో బయటకు వాహనాల్లో వెళ్లేటప్పుడు ముందు కనిపించనందున నిదానంగా వెళ్తే ప్రమాదాలు జరగవు
- జలుబు, దగ్గు, ఆయాసం, సైనస్ వంటి సమస్యలు ఉన్న వారు చలిలో బయటకు రాకుండా ఉండటమే మంచిది
- చల్లటివి కంటే కాచి చల్లార్చిన నీటినే తాగటం మేలు
- ఈ కాలంలో ఫ్రిజ్‌లో నిల్వవున్న ఆహార పదార్థాలు తినొద్దు
- నిల్వవున్న, కలుషిత ఆహారం తినొద్దు
- ఈగలు వాలిన పదార్థాలను తినొద్దు
- శరీరం డీ హైడ్రేషన్‌కి గురికాకుండా సరిపడా నీటిని తాగాలి
- సరిపడా నిద్ర పోవాలి. ఒత్తిడి తగ్గటంతోపాటుగా మెదడు చురుగ్గా పనిచేస్తుంది
- శానిటైజర్, సబ్బుతో చేతులను శుభ్రపర్చుకోవాలి.

రంగవల్లి



17 చుక్కలు 5 వరుసలు, 5 వచ్చేవరకు(సరిచుక్క)



సి.రాజ్యలక్ష్మి,
హైద్రాబాద్,
70951 63101.

మా చిరునామా
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రెండో పాట విడుదల



వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబోలో రాబోతున్న 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం నుండి తాజాగా రెండో సాంగ్ విడుదలైంది. 'నా లైఫ్‌లో ఉన్న ఆ ప్రేమ పేజీ తీయనా.. పేజీలో రాసున్నా అందాల ఆ పేరు మీనా..' అంటూ ఈ పాట సాగింది. ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకత్వంలో భీమ్స్, ప్రణవి ఆచార్య పాడారు.

ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 14న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

'బలగం' మొగిలయ్య మృతి



'బలగం' మూవీ ఫేమ్, జానపద కళాకారుడు మొగిలయ్య (67) కన్నుమూశారు. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున ఆయన తుదిశ్వాస విడిచారు. మొగిలయ్య గత కొన్ని నెలలుగా కిడ్నీ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్నారు. మొగిలయ్య స్వగ్రామం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని దుగ్గొండి. మొగిలయ్య మరణం పట్ల బలగం సినిమా డైరెక్టర్ వేణు యెల్దండి, నటీనటులు సంతాపం తెలిపారు. మొగిలయ్య వైద్య ఖర్చులు 'బలగం' డైరెక్టర్ వేణు యెల్దండి, చిత్ర యూనిట్‌తో పాటు ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం అందించింది. చిరంజీవి కూడా ఆర్థిక సాయం చేశారు. రెండు కిడ్నీలు సరిగ్గా పని చేయకపోవడంతో మొగిలయ్య అనారోగ్యానికి గురయ్యారు. వారానికి రెండు సార్లు డయాలసిస్ చేస్తున్న క్రమంలో ఆయనకు గుండె సంబంధిత సమస్యలు కూడా తలెత్తినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల మొగిలయ్య తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారు జామున మరణించారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన మొగిలయ్య, కొమురమ్మ దంపతులు బుర్ర కథలు చెప్పుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తమ పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వచ్చిన కళ బుర్రకథను చెప్పడమే వీళ్లకు జీవనాధారం. వరంగల్, మంచిర్యాల, గోధావరిఖని, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో బుర్రకథ చెబుతూ.. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. ఈ దంపతులు 'బలగం' సినిమా క్లైమాక్స్‌లో పాడిన పాట మంచి హిట్ అయ్యింది. దీంతో మొగిలయ్యకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

అసలు కథంతా 'విడుదల 2' నే : చింతపల్లి



'విడుదల–1'లో కేవలం పాత్రలు ఎస్టాబ్లిష్ మాత్రమే జరిగింది. అయితే కథ అంతా 'విడుదల–2'లోనే ఉంటుంది. మొదటి భాగానికి మించి పదిరెట్లు అద్భుతంగా రెండోభాగం ఉంటుంది. ఇందులో పెరుమాళ్ పాత్రలో విజయ్ సేతుపతి అద్భుతమైన నటన, భావోద్వేగాలు చూస్తారు. అణగారిన వర్గాల నుంచి ఉద్భవించిన ఓ విప్లవ కెరటం. పెట్టుబడిదారి వ్యవస్థ నుంచి ప్రజల్ని ఎలా బయటపడేలా చేశాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లోని సమస్యలు, ఇక్కడ జరిగిన సంఘటనలతో తీసిన చిత్రమిది. ఇళయరాజా నేపథ్య సంగీతం ప్రాణంగా నిలుస్తుంది. నేను నిర్మించిన 'శ్రీశ్రీ రాజావారు' చిత్రం రిలీజ్ కానుంది. త్వరలోనే 'డ్రీమ్ గర్ల్' అనే మూవీని ప్రారంభించబోతున్నాం. మరో రెండు సినిమాలు సెట్స్ మీదకు వెళ్లటానికి సిద్ధంగా ఉన్నాయి' అని నిర్మాత చింతపల్లి పాపారావు అన్నారు. విజయ్‌సేతుపతి ప్రధాన పాత్రలో సూరి, మంజు వారియర్ ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం 'విడుదల 2'. వెట్రి మారన్ దర్శకత్వంలో ఎల్‌రెడ్‌కుమార్ ఈ సినిమాను నిర్మించారు. శుక్రవారంనాడు ఈ సినిమాను శ్రీ వేధాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు తెలుగులో విడుదల చేస్తున్నారు.



నేడు 'బచ్చలమల్లి' విడుదల

అల్లరి నరేష్ సరసన అమృత అయ్యర్ నటించిన సినిమా 'బచ్చలమల్లి'. సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతాన్ని సమకూర్చారు. హాస్యా మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. గత కొద్దిరోజులుగా ప్రచార కార్యక్రమాలను చిత్ర యూనిట్ పెద్దఎత్తున నిర్వహించింది. ఇటీవల విడుదల చేసిన టీజర్, పాటలు సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండ్ అవుతున్నాయి. ప్రమోషన్ కార్యక్రమానికి నటుడు నాని కూడా హాజరయ్యారు. చిత్రం విడుదల సందర్భంగా సుబ్బు మంగాదేవి మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమాను విడుదల చేస్తున్నామన్నారు. సరికొత్త కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నామని పేర్కొన్నారు.

ఏప్రిల్ 10న 'జాక్' విడుదల



సిద్ధు జొన్నలగడ్డ నటుడిగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'జాక్'. కొంచెం క్రాక్ అనేది ఉపశీర్షిక. ఈ సినిమా ఏప్రిల్ 10న విడుదలకానుంది. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ సినిమాల తర్వాత సిద్ధు నటిస్తున్న చిత్రం ఇదే. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సిద్ధు సరసన వైష్ణవి చైతన్య నటిస్తున్నారు. కీలకపాత్రల్లో ప్రకాష్‌రాజ్, నరేష్, బ్రహ్మాజీ వంటి వారు నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 80 శాతం వరకూ పూర్తయ్యింది. ఏప్రిల్ 10న ఈ సినిమాను విడుదల చేయబోతున్నామని మేకర్లు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. వేసవి కానుకగా రాబోతున్న ఈ సినిమా తుది షెడ్యూల్ త్వరలోనే పూర్తికానుంది. అచ్చు రాజమణి సంగీతాన్ని అందిస్తున్నా ఈ చిత్ర ప్రచార కార్యక్రమాలను త్వరలోనే యూనిట్ ప్రారంభిస్తుందని మేకర్లు ప్రకటించారు.

రికార్డు పుటల్లో రీచా

- 18బంతుల్లోనే అర్ధసెంచరీ
- మంధాన మూడో అర్ధసెంచరీ
- మూడో టి20లో వెస్టిండీస్ అమ్మాయిలపై ఘన విజయం
- సిరీస్ 2–1తో భారత్ కైవసం



ముంబయి: వెస్టిండీస్ మహిళలతో జరిగిన మూడో, చివరి టి20లో భారత్ గెలిచి సిరీస్‌ను చేజిక్కించుకుంది. గురువారం జరిగిన నిర్ణయాత్మక టి20లో భారతజట్టు 60పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 217పరుగుల రికార్డు స్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో వెస్టిండీస్ జట్టు 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 159పరుగులు చేసింది. తొలుత కీపర్ రీచా ఘోష్ రికార్డు కదం తొక్కింది. కేవలం 18బంతుల్లోనే అర్ధసెంచరీని కొట్టింది. దీంతో 2015లో సోఫీ డివైన్(న్యూజిలాండ్) పేర ఉన్న 18బంతుల్లోనే అర్ధసెంచరీ రికార్డును సమం చేసింది. రీచా అర్ధసెంచరీకి తోడు.. కెప్టెన్ స్మృతి మంధాన కూడా బ్యాట్ ఝుళిపించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన భారత్ జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఓవర్ చివరి బంతికే ఓపెనర్ ఉమా ఛెత్రి (0) డకౌట్ అయ్యింది. హెన్రీ బౌలింగ్‌లో జోసెఫ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రోడ్రిగ్స్‌తో కలిసి కెప్టెన్ మంధాన ఇన్నింగ్స్ నిర్మించింది. క్రీజులో నిలదొక్కుకుంటూ.. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించింది. జోరుమీద ఉన్న ఈ జోడీని ఫ్లెచర్ విడగొట్టింది. జట్టు స్కోరు 99 పరుగుల వద్ద రోడ్రిగ్స్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగింది. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే మంధాన కూడా డాటిన్ బౌలింగ్‌లో హెన్రీకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరింది. చివర్లో రిచా ఘోష్, బిస్త్ దూకుడుగా ఆడటంతో భారత్ భారీ స్కోరే చేసింది. కెప్టెన్ మంధాన(77; 47బంతుల్లో 13ఫోర్లు, సిక్సర్) వరుసగా మూడో అర్ధసెంచరీతో రాణించగా.. రోడ్రిగ్స్(39) ఫర్వాలేదనిపించింది. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత రీచా ఘోష్ కేవలం 18బంతుల్లోనే అర్ధసెంచరీ చేసి ఈ ఫార్మట్‌లో వేగంగా అర్ధసెంచరీ రికార్డును సమం చేసింది. రీచా ఘోష్(54; 21బంతుల్లో 3ఫోర్లు, 5సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగింది. దీంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. వెస్టిండీస్ బౌలర్లు హెన్రీ, డోటిన్, అలియానే, ఫ్లెచర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

ఛేదనలో వెస్టిండీస్ టాపార్డర్ బ్యాటర్లు మాథ్యూస్(22), డోటిన్(25), హెన్రీ(43) మాత్రమే రాణించారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లను రాధా యాదవ్(4/29) కట్టడి చేసింది. దీంతో మూడు టి20ల సిరీస్‌ను భారత్ 2–1తో చేజిక్కించుకుంది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు 47వేల మందికి పైగా అభిమానులు హాజరుకావడం విశేషం. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రీచా ఘోష్‌కు సిరీస్‌కు స్మృతి మంధానకు దక్కాయి. ఆదివారం నుంచి వడోధర వేదికగా మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది.

స్కోర్‌బోర్డు...

భారత్ మహిళల ఇన్నింగ్స్: మంధాన (సి)హెన్రీ (బి)డోటిన్ 77, ఛెత్రి (సి)జోసెఫ్ (బి)హెన్రీ 0, రోడ్రిగ్స్ (ఎల్‌బి)ఫ్లెచర్ 39, బిస్త్ (నాటౌట్) 31, రీచా (సి)హెన్రీ (బి)అలియానే 54, సజన (నాటౌట్) 4, అదనం 12. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 217పరుగులు **వికెట్ల పతనం:** 1/1, 2/99, 3/143, 4/213 **బౌలింగ్:** హెన్రీ 2–0–14–1, డోటిన్ 4–0–54–1, మాథ్యూస్ 4–0–34–0, కరిష్మా 3–0–44–0, అలియానే 4–0–45–1, ఫ్లెచర్ 3–0–24–1.

వెస్టిండీస్ మహిళల ఇన్నింగ్స్: మాథ్యూస్ (సి)సజన (బి)రాధా యాదవ్ 22, జోసెఫ్ (టిటాస్ సద్దు (బి)సజన 11, డోటిన్ (సి)రాధా యాదవ్ (బి)టిటాస్ సద్దు 25, క్యాంప్‌బెల్ (సి)మంధాన (బి)దీప్తి 17, హెన్రీ (సి)బిస్త్ (బి)రేణుక 43, క్రాఫ్టన్ (రనౌట్)ఉమా ఛెత్రి/రీచా 9, అలియానే (బి)రాధా యాదవ్ 6, షబికా (సి)సజన (బి)రాధా యాదవ్ 3, జేమ్స్ (సి)రీచా (బి)రాధా 7, ఫ్లెచర్ (నాటౌట్) 5, రామ్‌రాక్ (నాటౌట్) 3, అదనం 6. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 157పరుగులు. **వికెట్ల పతనం:** 1/20, 2/57, 3/62, 4/96, 5/129, 6/136, 7/137, 8/142, 9/147 **బౌలింగ్:** రేణుక 3–0–16–1, సజన 2–0–16–1, సైమా ఠాకూర్ 4–0–33–0, టిటాస్ సద్దు 3–0–31–1, రాధా యాదవ్ 4–0–29–4, దీప్తి శర్మ 4–0–31–1.

మహిళల టి20 రికార్డులు..

అత్యధిక అర్ధసెంచరీ...

1. మంధాన(ఇండియా) : 30(142 ఇన్నింగ్స్)
2. సూజీ బేట్స్(న్యూజిలాండ్) : 29(168 ఇన్నింగ్స్)
3. బెత్ మూనీ(ఆస్ట్రేలియా) : 25(100 ఇన్నింగ్స్)
4. స్టఫనీ టేలర్(వెస్టిండీస్) : 22(122 ఇన్నింగ్స్)
5. సోఫీ డివైన్(న్యూజిలాండ్) : 22(139 ఇన్నింగ్స్)

తక్కువ బంతుల్లో అర్ధసెంచరీ..

1. రీచా ఘోష్(ఇండియా) 18బంతుల్లో వెస్టిండీస్‌పై, 2024
2. సోఫీ డివైన్(న్యూజిలాండ్) 18బంతుల్లో ఇండియాపై, 2015
3. లిచ్‌ఫీల్డ్(ఆస్ట్రేలియా) 18బంతుల్లో, వెస్టిండీస్‌పై, 2023
4. నదీ ధార్(పాకిస్తాన్) 19బంతుల్లో, దక్షిణాఫ్రికాపై, 2019

టీమిండియా అమ్మాయిల అత్యధిక స్కోర్...

217 : వెస్టిండీస్‌పై 2024
210 : యుఏఇపై, 2024
198 : ఇంగ్లండ్‌పై, 2018
195 : వెస్టిండీస్‌పై, 2024
194 : న్యూజిలాండ్‌పై, 2018



యుపి, ముంబ గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్–11

పూణే: ప్రొ కబడ్డీ సీజన్–11లో యుపి యోధాస్ హవా కొనసాగుతోంది. గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో యుపి జట్టు 59–23పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుచేసింది. యుపి రైడర్లు గగన్(19), రాజ్‌పుట్(11) రైడ్స్‌లో రాణించగా.. ట్యాకిల్స్‌లో సుమిత్, ఆశు రాణించారు. ఆ జట్టు ఏకంగా 8సార్లు గుజరాత్‌ను ఆలౌట్ చేయడంతోపాటు రైడ్‌ల ద్వారా 31పాయింట్లు, ట్యాకిల్స్ ద్వారా 18పాయింట్లు సాధించింది. ఇక గుజరాత్ జట్టులో గుమన్(7), జితేందర్(6) మాత్రమే రైడ్స్‌లో రాణించారు. దీంతో యుపి జట్టు 21 మ్యాచ్‌లు ముగిసేసరికి 12 విజయాలుతో సహా 74పాయింట్లతో 2వ స్థానానికి ఎగబాకింది. మరో మ్యాచ్‌లో యు ముంబ జట్టు 43–37పాయింట్ల తేడాతో పట్నా పైరెట్స్‌ను చిత్తు చేసింది. ముంబ రైడర్ అజిత్(15) రాణించగా.. సునీల్(5) ట్యాకిల్స్‌లో మెరిసాడు. ఈ

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68